మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 45 | శనివారం 14 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3




## మున్సిపల్ ఎన్నికల్లో బోణి కొట్టిన జనసేన




## లోకేశ్ ఇంట కూటమి నేతల సందడి..



మంత్రి లోకేశ్ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం

చిత్తూరు, అనకాపల్లి కూటమి నేతలకు ఆత్మీయ విందు


కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు

వినతుల పురోగతిపై ప్రజాప్రతినిధులకు నివేదికల అందజేత

2లో

మహిళలకు కానుకగా మంగళగిరి పట్టుచీరలు

## సిమెంట్ స్కామ్‌లో 'భారతి'




పేదల ఇళ్ల పేరుతో సొంత వ్యాపారం

నాడు సిమెంట్ కొనుగోళ్లలో 'భారతీ'కి పెద్దపీట

అర్హతకు మించి 3 రెట్లు కొనుగోలు

భారతీ సిమెంట్స్‌కు రూ.165 కోట్లు చెల్లింపులు

అదనంగా రూ.110 కోట్లు బిజినెస్

జగన్ కుటుంబానికి అయాచిత లబ్ధి

పైగా టన్ను ధరపై అధికంగా రూ.60 చెల్లింపు

'భారతి' కంటే ఎక్కువ ప్లాంట్ సామర్థ్యం ఉన్న కంపెనీలకు తక్కువ ఆర్డర్లు

2లో

ఆలస్యంగా వెలుగులోకి విజిలెన్స్ నివేదిక

బంధుప్రీతి, రాజకీయ కుట్ర ఉన్నట్టు వెల్లడి

పేదలకు గృహ నిర్మాణం పేరిట జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్‌కు అర్హతకు మించి ఆర్డర్లు ఇచ్చిన వైనం ఇప్పుడు బయటపడింది. దామాషా పద్ధతిన భారతీ సిమెంట్స్ నుంచి కొనాల్సిన దానికంటే మూడు రెట్లు అదనంగా కొనుగోలు చేశారు. నాడు అధికారంలో ఉన్న జగన్... ఆ మేరకు తన కుటుంబ వ్యాపారాన్ని పెంచుకున్నారు. దీనికోసం ఇతర సిమెంట్ కంపెనీల ఆర్డర్లకు గండి కొట్టారు. ఈ అక్రమ వ్యవహారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెలుగు చూసింది. పేదల ఇళ్ల నిర్మాణం పేరిట భారతీ సిమెంట్స్ నుంచి పరిమితికి మించి ఏకంగా 3,31,528 టన్నుల సిమెంట్ కొనుగోలు చేశారు. ఇందుకోసం జగన్ కుటుంబానికి రూ.165 కోట్లు చెల్లించారు. అంటే.. రూ.55 కోట్ల విలువైన సిమెంట్ కొనుగోలు చేయాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.110 కోట్ల విలువైన సిమెంట్ అదనంగా తీసుకున్నారు. అప్పటి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు వైసీపీ పెద్దలతో కుమ్మక్కయినట్టు విజిలెన్స్ విభాగం తేల్చింది. ముందస్తు ప్రణాళికలో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తెరమీదకు తెచ్చినట్లుగా కనిపిస్తోందని పేర్కొంది. లబ్ధిదారులకు తెలియకుండా, వారి ప్రమేయం లేకుండా లక్షలాది పక్కా ఇళ్ల నిర్మాణం కోసం సిమెంట్‌తో పాటు ఇనుము, ఇతర మెటీరియల్స్‌ను ఒకేసారి కొనుగోలు చేసి రూ.వేల కోట్ల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసినట్టు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. గత ప్రభుత్వ పెద్దలకు కావలసినవారి సిమెంట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసం భారీస్థాయిలో ప్రభుత్వ నిధులను

## మానుకోట వేడెక్కుతోంది..



తమ చైర్మన్ అభ్యర్థి ఓడిపోవడంతో...! స్వతంత్రుల్లో ఒకరికి చైర్మన్ పదవి అంటూ కాంగ్రెస్ ఆఫర్...!

కుమార్తెకు పట్టం కట్టడం కోసం పట్టుదలగా మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ప్రయత్నాలు..

ఊపిరి బిగపట్టిన ఉత్కంఠ....

2లో

**మహబూబాబాద్, ఫిబ్రవరి 13(నంది పత్రిక):** మహబూబాబాద్ మున్సిపాలిటీలో ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు స్పష్టమైన ఆధిక్యత రాకపోవడంతో చైర్మన్ ఎంపికలో స్వతంత్రులు కీలకంగా మారారు. మ్యాజిక్ ఫిగర్ 19...!!! 36 కౌన్సిలర్ స్థానాలు ఉన్న మహబూబాబాద్ మున్సిపాలిటీలో మ్యాజిక్ ఫిగర్ 19కి అన్ని పార్టీలు దూరంగానే ఉన్నాయి. దీంతో రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలు ప్రారంభమయ్యాయి. ఎవరు ఎటో తేల్చుకునేందుకు ఇరు ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. కాంగ్రెస్ 13 వార్డుల్లో గెలుపొందగా సిపిఎం మూడు చోట్ల గెలుపొందింది సిపిఎం మద్దతుతో కాంగ్రెస్ బలం 16కి చేరింది. బిఆర్ఎస్ 11 స్థానాల్లో గెలుపొందగా సిపిఐ 03 చోట్ల గెలిచింది, వీరి మద్దతుతో బిఆర్ఎస్ బలం 14 స్థానాలకు చేరింది. బిజేపీ మద్దతు కాంగ్రెస్ కు కాకుండా బిఆర్ఎస్ కు లభించే అవకాశం ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దీంతో విజేతలుగా నిలిచిన ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. కాంగ్రెస్ నుండి చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న బాలు చౌహాన్ ఓడిపోవడంతో స్వతంత్రుల్లో ఒకరికి చైర్మన్ పదవి ఇస్తామంటూ అధికార పార్టీ ఆఫర్ చేసినట్లు సమాచారం. అదే సమయంలో బిఆర్ఎస్ కూడా తాము అధికారం దక్కించుకునేందుకు స్వతంత్రులతో భారీ స్థాయిలో మంతనాలు కొనసాగిస్తోంది.

## నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు:



2లో

నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం సరికాదన్న సీఎం చంద్రబాబు

2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం

ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని..

ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్

విశాఖకు గూగుల్, టీసీఎస్..

రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ

## మా భూములు ఇవ్వం



నేవీ డిపో నిర్మాణం ఉపసంహరించాలి

2లో

కలెక్టరేట్ వద్ద గర్జించిన కొయ్యలగూడెం మండల రైతులు

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం..

### అనేకచోట్ల హంగ్.. క్యాంపు రాజకీయాలకు తెర!



తెలంగాణ పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా

2లో

మొత్తం 116 మున్సిపాలిటీల్లో 62 చోట్ల హస్తం పార్టీకి స్పష్టమైన మెజారిటీ

పలుచోట్ల హంగ్ ఫలితాలు రావడంతో క్యాంపు రాజకీయాలకు తెరలేపిన పార్టీలు

కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా.. కీలక స్థానాల్లో పట్టు నిలుపుకున్న బీజేపీ

చైర్మన్లు, మేయర్ల ఎన్నిక కోసం సోమవారం ప్రత్యేక సమావేశాలు

## పట్టణం హస్తానిదే



## లిక్కర్ స్కామ్‌లో మరో 'స్కీమ్'



ఒక పెద్ద కుంభకోణం... దానికి అనుగుణంగా మరిన్ని కుంభకోణాలు! జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో తవ్వే కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. డిపోల నుంచి మద్యం దుకాణాలకు లిక్కర్ బాక్సుల సరఫరా పేరుతో రూ.400 కోట్లు దోచేసినట్లు తేలింది. దీని వెనుక ఎవరున్నారో తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. రూ.3200కోట్ల లిక్కర్ స్కామ్‌ను వెలికి తీసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికే (సిట్) ఈ బాధ్యతను అప్పగించింది. దీనిపై ఈ నెల 10న సీఐడీ కేసు (11/2026)

మద్యం రవాణాలో రూ.400 కోట్ల దోపిడీ

సూత్రధారుల కథ తేల్చాలని సిట్‌కు ఆదేశం

బాక్స్ రవాణా చార్జీ 13 నుంచి 34కు పెంపు

టెండర్ దక్కించుకున్న కసిరెడ్డి బినామీ కంపెనీ

తర్వాత పలువురు వైసీపీ నేతలకు సబ్ కాంట్రాక్టు

2లో

సీఐడీ కేసు నమోదు.. దర్యాప్తు బాధ్యత 'సిట్'కు!

# సిమెంట్ స్కామ్‌లో 'భారతి'

దుర్వినియోగం చేయడం వెనుక బంధుప్రీతి, రాజకీయ కుట్ర ఉన్నట్లుగా పరిగణించవచ్చని విజిలెన్స్ విభాగం నివేదికలో వెల్లడించింది.

**ఆప్షన్-3 ఆలోచనలోనే కుట్ర** బలహీనవర్గాలకు పక్కా ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశల వారీగా సబ్సిడీ నిధులు విడుదల చేస్తుంటే.. లబ్ధిదారులు సొంతంగానే తమ ఇళ్లు పూర్తి చేసుకునేవారు. కానీ 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల గృహనిర్మాణ పథకం పూర్తిగా పక్కదారి పట్టింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే రాయితీ నిధులతో పక్కా ఇళ్లు కట్టుకోలేని పేదలకు ఆప్షన్-3 కింద రాష్ట్ర ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇస్తుందని అప్పటి ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 3.51 లక్షల మంది లబ్ధిదారులు తమ సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఆప్షన్-3ని ఎంపిక చేసుకున్నారు. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందని నమ్మేశారు. జగన్ ప్రకటించిన ఆప్షన్-3 వెనుక కుట్ర కోణం దాగి ఉందని ఎవరూ ఊహించలేకపోయారు. జగన్ ప్రభుత్వం ముందస్తు పథకం ప్రకారం.. ఆప్షన్-3 ఎంపిక చేసుకున్న పేదల ఇళ్లను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా కట్టించకుండా నిర్మాణ రంగంలో కనీస పరిజ్ఞానం, అనుభవం, అర్హతలు లేని వైసీపీ నాయకులకు బాధ్యతలు అప్పగించింది. టెండర్లు, అగ్రిమెంట్లు, పూచీకత్తుల వంటివి ఏమీ లేకుండానే ఒక్కొక్కరికి రూ.వందలు, వేల కోట్ల విలువైన కాంట్రాక్టులు కట్టబెట్టింది. ఇళ్ల పనులు మొదలు పెట్టకుండానే కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీ కింద వచ్చిన రూ. వేల కోట్ల నిధులను హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టర్లకు అడ్వాన్సుల కింద ఎడాపెడా దోచిపెట్టారు. నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి ఈ దోపిడీలో భాగస్వాములైన హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు.. పనిలోపనిగా నాటి ముఖ్యమంత్రి జగన్ సతీమణికి కూడా అవినీతిలో భారీగా వాటా కల్పించారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణానికి వినియోగించే సిమెంట్, స్టీలు, ఇతర నిర్మాణ సామగ్రిని నిబంధనలకు విరుద్ధంగా సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించడానికి ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. వెంటనే తమ ప్రణాళికను చకచకా అమలు చేసేశారు.

**ఇతర కంపెనీలకు అన్యాయం** భారతీ సిమెంట్స్ కన్నా ఎక్కువ ప్లాంట్ సామర్థ్యం అర్హత ఉన్న అల్ట్రా టెక్, రామ్‌కో, మై హోం, పెన్నా, సాగర్, జువారీ కంపెనీలతో పాటు కేసీపీ, జేఎసడబ్ల్యూ, రెయిన్, పరాశక్తి, భవ్య, ఎన్‌సీఎల్, శ్రీచక్ర, శ్రీజయ జ్యోతి సిమెంట్ ప్రైవేట్ కంపెనీలకు మాత్రం వాటి ప్లాంట్ సామర్థ్యాల కంటే తక్కువ కొనుగోళ్లు ఆర్డర్లు ఇచ్చారు. మొత్తంగా 18 సిమెంట్ కంపెనీలకు రూ.1143.11 కోట్లు చెల్లించారు. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించిన 22,64,855 టన్నుల సిమెంట్‌ను అన్ని జిల్లాల్లో గోదాముల్లో నిల్వ చేశారు.

**ధరలోనూ అదనంగా చెల్లింపు** పేదల ఇళ్ల నిర్మాణం కోసం మొత్తం 18 సిమెంట్ తయారీ కంపెనీల నుంచి మొత్తం 22,64,855 టన్నుల సిమెంట్‌ను కొనుగోలు చేశారు. ఆయా సిమెంట్ తయారీ కంపెనీల ప్లాంట్ సామర్థ్యాలను బట్టి దామాషా ప్రకారం సిమెంట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ 2020లో నాటి ముఖ్యమంత్రి జగన్ మెప్పు కోసం ఆయన కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ ప్లాంట్ సామర్థ్యం అర్హతకు మించి 3 రెట్లు ఎక్కువ బిజినెస్ ఇచ్చారు. దాదాపు లక్షా 10 వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉండగా, ఏకంగా 3,31,528 టన్నుల సిమెంట్ కొన్నారు. ఇందుకుగాను రూ.165.58 కోట్ల ప్రభుత్వ ధనాన్ని భారతీ సిమెంట్స్‌కు చెల్లించారు.

కాగా ధర కూడా ముందుగా నిర్ణయించిన దానికంటే అధికంగా చెల్లించారు. మొదట బస్తా ధరను పీపీసీ రకానికి రూ.225, ఓపీసీ రకానికి రూ.235గా నిర్ణయించారు. అయితే బస్తాపై రూ.3 ఎక్కువగా టన్నుకు రూ.60 అదనంగా చెల్లించారు. భారతీ సిమెంట్స్ తర్వాత ఇండియా సిమెంట్స్ లిమిటెడ్, చెట్టినాడ్, దాల్మియా కంపెనీలకు వాటి ప్లాంట్ల సామర్థ్యానికి మించి 2 రెట్లు ఎక్కువగా సిమెంట్ కొనుగోలు చేశారు.

# మానుకోట వేడెక్కుతోంది..



**కూతురు కోసం...!!** మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కుమార్తె తేజస్విని 20వ వార్డు నుంచి గెలవడంతో ఆమెను చైర్ పర్సన్ కుర్చీలో కూర్చోబెట్టాలన్న పట్టుదలతో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పావులు కదుపుతున్నారు. అసలే మొండిఘటంగా పేరున్న శంకర్ నాయక్ ఎలా అయితే అలా..., ఏ..మార్గంలో అయితే ఆ..మార్గంలో ఎటువంటి రాజీ లేకుండా, ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకుండా శతవిధాలా చక్రంతిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఎక్స్ అఫీషియో ఓట్లు కూడా కీలకమే..! మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో ఓట్లు ఇరు పార్టీలకు కీలకంగా మారనున్నాయి. అధికార కాంగ్రెస్ కి ఎమ్మెల్యే మురళినాయక్, ఎంపీ బలరాంనాయక్ బలం ఉండగా బిఆర్ఎస్ కు ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఓట్లు ఉన్నాయి. ఇరు పార్టీలకు చెరి రెండు ఓట్లు ఉండడం, మహబూబాబాద్, కేసముద్రం రెండు మున్సిపాలిటీల్లోను వీరి ఓట్లే కీలకం కావడంతో అంచనాలు మరింత జటిలంగా మారాయి. కేసముద్రంలో 16 స్థానాలకు గాను చెరి ఎనిమిది స్థానాలను కాంగ్రెస్, బిఆర్ఎస్ గెలుచుకుంది. మహబూబాబాద్ లోనూ హోరాహోరీగా పలితాలు వెలువడ్డాయి. దీంతో చైర్మన్ ఎన్నికల సందర్భంగా ఈ..నలుగురు ఎవరు ఎక్కడ ఓటు వినియోగించుకుంటారోనన్న డైలమా నెలకొంది. ఎక్స్ అఫీషియో ఓట్లు కూడా తుది ఫలితాన్ని నిర్ణయించే అంశంగా మారే పరిస్థితి లేకపోలేదు. ఏది ఏమైనా ఈనెల 16వ వరకు మహబూబాబాద్ నియోజకవర్గంలో రాజకీయం రగులుతున్న జ్వాలగా సెగలు కక్కుతూనే ఉండవచ్చనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# లిక్కర్ స్కామ్‌లో మరో 'స్కీమ్'

నమోదు చేయగా... పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, అక్రమాలు నిగ్గు తేల్చే బాధ్యతను ప్రభుత్వం సిట్‌పై పెట్టింది. ఐపీసీలోని 420, 409, 468, 471, 120(బి), సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111, 212, 217, 317 కింద పలువురిపై సీఐడీలో కేసు నమోదైంది.

**అసలేం జరిగింది...** 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం షాపులు ప్రభుత్వమే నిర్వహించేలా లిక్కర్ పాలసీ రూపొందించారు. ముడుపులు ఇచ్చిన వారికే ఆర్డర్లు వెళ్లేలా చేసి... భారీ కుంభకోణానికి తెరలేపారు. ఇందులో... మద్యం రవాణాలోనూ కోట్లు గిల్లుకున్నారు. మద్యం తయారీదారులు డిపోల వరకూ సరుకును చేరవేస్తారు. అక్కడి నుంచి షాపులకు చేర్చేందుకు ప్రతి మద్యం కేసుకు రూ.13 చొప్పున ఏపీఎస్‌బీసీఎల్ చెల్లించేది. దానిని జగన్ హయాంలో ఏకంగా రూ.34కు పెంచేశారు. మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డికి సన్నిహితుడైన తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి అప్పటికే కార్గో వ్యాపారం చేసేవాడు. కిరణ్ కుమార్ రెడ్డిని బినామీగా పెట్టుకుని రాజ్ కసిరెడ్డి 'సిగ్మా' పేరుతో ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని మద్యం షాపులకు లిక్కర్ సరఫరా చేసే టెండర్లు ట్యాంపరింగ్ చేశారు. రూ.13ఉన్న కేసు సరఫరా ధరను ఏకంగా రూ.34కు పెంచి టెండర్ దక్కించుకున్నారు. దీనిని... జిల్లాల వారీగా కొందరు ముఖ్యమైన వైసీపీ నేతలకు సబ్ కాంట్రాక్టు ఇచ్చేశారు. అనంతపురం జిల్లాలో 'గుడ్ మార్నింగ్ స్టార్'గా పేరొందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. ఇటీవల ముఖ్యమంత్రిని దూషించి జైలు పాలైన గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి, రైతులను బూతులు తిట్టి వివాదం చెలరేగడంతో 'బుజ్జికన్నా' అంటూ బూతులకు కొత్త అర్థాన్ని తీసిన గోదావరి జిల్లాలకు చెందిన మాజీ మంత్రి కుమారుడు, శాసనమండలిలో వైసీపీకి పెద్ద దిక్కైన ఉత్తరాంధ్ర నాయకుడి మేనల్లుడు... ఇలా పలువురికి సబ్‌కాంట్రాక్టులు దక్కాయి. సరుకు రవాణా చార్జీలను ఒకేసారి రూ.13 నుంచి 34కు పెంచి... మొత్తంగా రూ.400 కోట్లు దోచేసినట్లు అంచనా. ఈ విషయం ఇప్పటికే సిట్ విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆయా నేతలకు నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉందని గత ఏడాది సెప్టెంబరు రెండో వారంలోనే 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అన్ని ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన తర్వాత కేసు నమోదుకు ఈ నెల మొదటి వారంలో సీఐడీకి ఆదేశాలు జారీ అయ్యాయి. నమోదైన కేసు దర్యాప్తు బాధ్యతలు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు నేతృత్వంలోని సిట్‌కు అప్పగిస్తూ శుక్రవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం..

తెలంగాణలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ, రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు తమకే పట్టం కట్టారని నిరూపించుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను, కాంగ్రెస్ పార్టీ ఏకంగా 62 చోట్ల విజయం సాధించి జెండా ఎగరేసింది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 12 మున్సిపాలిటీలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. మరో నాలుగు మున్సిపాలిటీల ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం హంగ్ ఫలితాలు. సుమారు 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇది రాబోయే రోజుల్లో రాజకీయ వేడిని మరింత పెంచనుంది. మున్సిపాలిటీలతో పాటు ఏడు కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ పార్టీ తన హవాను కొనసాగించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో స్పష్టమైన మెజారిటీ సాధించగా, మహబూబ్‌నగర్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలుచుకుని సమ ఉజ్జీలుగా నిలిచాయి. మరోవైపు, బీజేపీ తమకు బలమైన పట్టున్న నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ రెండు ప్రాంతాలు బీజేపీ సిట్టింగ్ లోక్‌సభ స్థానాలు కావడం గమనార్హం. వార్డుల వారీగా చూస్తే, మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను, శుక్రవారం సాయంత్రం 4:30 గంటల వరకు 2,543 స్థానాల ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్ 1,325 వార్డులు గెలుచుకోగా, బీఆర్ఎస్ 707, బీజేపీ 260 వార్డుల్లో విజయం సాధించాయి. ఎంఐఎం, ఇండిపెండెంట్లు కలిపి 251 స్థానాలను దక్కించుకున్నారు. కార్పొరేషన్ల పరిధిలోని 414 డివిజన్లకు గాను వెలువడిన 291 ఫలితాల్లో, కాంగ్రెస్ 154, బీఆర్ఎస్ 49, బీజేపీ 34, ఇతరులు 54 స్థానాలు కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో 73 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో 75.88 శాతం, కార్పొరేషన్లలో 66.05 శాతం పోలింగ్ జరిగింది. కాగా, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేయనున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఫిబ్రవరి 16న (సోమవారం) ప్రమాణ స్వీకారం చేసి, అదే రోజు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లను ఎన్నుకోనున్నారు.

# ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

## ఏపిజెయు రాష్ట్ర కార్యదర్శి నందవరం శ్రీనివాసులు



**దొర్నిపాడు. ఫిబ్రవరి 13. (నంది పత్రిక ):**నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డ నియోజకవర్గం పరిధిలోని దొర్నిపాడు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ప్రజ్ఞ కళాశాల, ఏపిజెయు జిల్లా కార్యదర్శి ప్యాపిలి ప్రసాద్ ఆర్థిక సహాకారంతో,ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో భోజనం ప్లేట్లు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఏపీజేయు రాష్ట్ర సహాయ కార్యదర్శి నందవరం శ్రీనివాసులు,మండల విద్యాశాఖ అధికారులు మనోహర్ రెడ్డి,రామచంద్రయ్యలు హాజరయ్యారు.ఈ సందర్భంగా నందవరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఆళ్ళగడ్డ నియోజకవర్గం, దొర్నిపాడు మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్రజ్ఞ కళాశాల, ఏపీజేయు జిల్లా కార్యదర్శి ప్యాపిలి ప్రసాద ఆర్థిక సహాకారంతో భోజనం ప్లేట్లు పంపిణీ చేయడం నా పూర్వ జన్మదిన సుకృతం గా భావిస్తున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో కేవలం జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాటం చేయడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా రక్త దానం, అన్నదానం, అనాథ వృద్ధులకు భోజనం, బెడ్ షీట్ల పంపిణీ, మారు మూల గ్రాలలో ఉచిత వైద్య సేవలు అందజేస్తామని తెలిపారు. నంద్యాల జిల్లాలో సేవా కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజేయు సభ్యులు వెంకట నారాయణ, శ్రీనివాసులు ప్రేమ్ కుమార్, గడ్డం శేఖర్, తబలా శ్రీనివాసులు,,గ్రామ సర్పంచ్ దేవమని రాంబాబు, విద్యా కమిటీ చైర్మన్ గురవయ్య,ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, ఉపాధ్యాయులు కిషోర్, వాణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# మా భూములు ఇవ్వం

'మా భూములు ఇవ్వం.. ప్రాణాలైనా అర్పిస్తాం.. నేవీ ఆయుధ డిపో నిర్మాణాన్ని అడ్డుకుంటాం'.. అంటూ కొయ్యలగూడెం మండల ప్రజలు గర్జించారు. నేవీ ఆయుధ డిపో నిర్మాణం నిలిపివేయాలని బలవంతపు భూసేకరణను విరమించా లని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద భోగిగూడెం, మంగపతిదేవి పేట, బర్కిత్ నగర్, రేగులకుంట, ఊట్లగూడెం గ్రామాల రైతులు, ప్రజ లు ధర్నా నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, పలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. వనజ, కృష్ణ చైతన్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ భూములు ఇవ్వం అని తేల్చి చెబుతున్నా ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఆయుధ డిపో నిర్మాణానికి ప్రభుత్వం పూనుకోవడం పాలకుల నిరంకుశత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతపు భూసేకరణ తక్షణం నిలపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. రైతులు సంసాని కిశోర్, ఇళ్ళ శ్రీరామ మూర్తి, బలుసు నాగేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# లోకేశ్ ఇంట కూటమి నేతల సందడి..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త, ఆరోగ్యకరమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం తెలిసిందే. కూటమిలోని ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో వ్యక్తిగత బంధాన్ని బలోపేతం చేసే దిశగా పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా ఆత్మీయ విందు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా నిన్న మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం కూటమి ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో సమావేశం అయిన లోకేశ్... ఇవాళ రాత్రి ఉండవల్లిలోని తన నివాస ప్రాంగణంలో చిత్తూరు, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని కూటమి ప్రజాప్రతినిధులకు, వారి కుటుంబ సభ్యులకు ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కుటుంబసభ్యులతో సహా విచ్చేసిన ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేశ్ స్వయంగా ఎదురేగి ఆప్యాయంగా స్వాగతం పలికారు. వారి కుటుంబ సభ్యులను పలకరించి, పరిచయం చేసుకున్నారు. స్పీకర్, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే అనే హోదాలకు అతీతంగా అందరూ కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. సరదా సంభాషణలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ విందు కొనసాగింది. ఈ సమావేశం ఒక పిక్నిక్‌ను తలపించిందని నేతలు ఆనందం వ్యక్తం చేశారు. లోకేశ్ కేవలం ఆతిథ్యానికే పరిమితం కాకుండా, పాలనపైనా తనదైన ముద్ర చూపించారు. ఆయా ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులపై గతంలో ఇచ్చిన వినతుల పురోగతిపై ఒక నివేదికను తయారు చేయించి, వారికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహుమతిగా అందించారు. ఈ ఆత్మీయ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గాలి భాను ప్రకాశ్, వీఎం థామస్, గురజాల జగన్ మోహన్, కె.మురళీమోహన్, పులివర్తి నాని, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. అలాగే, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ (బీజేపీ), స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, కొణతాల రామకృష్ణ (జనసేన), పంచకర్ల రమేశ్ బాబు (జనసేన), సుందరపు విజయ్ కుమార్ (జనసేన) తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. విందు పూర్తయ్యాక, అతిథులందరినీ మంత్రి లోకేశ్ స్వయంగా గేటు వద్దకు వచ్చి సాగనంపడం ఆయన వినయానికి, సంస్కారానికి నిదర్శనంగా నిలిచింది.

# పంచాయతీ కార్యదర్శులకు ఊరట

## మంత్రి సీతక్క చొరవతో అంతర్ జిల్లా డిప్యూటేషన్‌కు అనుమతులు

## 223 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉపశమనం

## ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపిన పంచాయతీ కార్యదర్శుల సంఘాలు

**తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 13 ( నంది పత్రిక )** తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో నెం.317 కారణంగా స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నిర్ణయం వెనుక పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క కీలక పాత్ర పోషించారు. జీవో 317 వల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీరియస్‌గా తీసుకున్న మంత్రి సీతక్క, పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేశారు.జీవో 317 వల్ల జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం జీవో 190 జారీ చేసింది. ఆ నిర్ణయానికి అనుగుణంగా అంతర్ జిల్లా డిప్యూటేషన్ ప్రక్రియను ప్రారంభించిన తొలి శాఖగా పంచాయతీ రాజ్ శాఖ నిలవడం మంత్రి సీతక్క కృషికి నిదర్శనం. ఖాళీలున్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా డిప్యూటేషన్లకు అనుమతులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పరిపాలన బలోపేతం చేయడం, సిబ్బందికి న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దుతూ, పారదర్శకంగా, న్యాయబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ నిర్ణయంతో పంచాయతీ కార్యదర్శులకు గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలుకానున్నాయి. మంత్రి సీతక్క నాయకత్వంలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది సంక్షేమం మరియు గ్రామీణ పరిపాలన బలోపేతానికి కట్టుబడి ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ప్రభుత్వం, మంత్రి సీతక్కకు సంఘాల ధన్యవాదాలు** ఈ నిర్ణయంపై రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ సమస్యలను సానుకూలంగా పరిగణించి వేగంగా పరిష్కరించిన తెలంగాణ ప్రభుత్వం, మంత్రి సీతక్కకు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా పనిచేస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్న పంచాయతీ కార్యదర్శులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట కలిగించిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేసిన మంత్రి సీతక్కకు, శాఖ అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియ చేశారు.



# నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు

పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం సమర్థనీయం కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులోంచి 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, పోలవరాన్ని వంశధారతో అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 20 నెలల్లో తమ సంకీర్ణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని వివరించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎదురైన ఇబ్బందులను అధిగమించిన తీరును, అభివృద్ధిని అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలను సభలో ప్రస్తావించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందుందని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు విశాఖకు వస్తున్నాయని చెప్పారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నం వద్ద రూ.70,000 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కచ్చితంగా నెరవేరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# నంద్యాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ గందరగోళం : వాహనదారుల ఆందోళన.





**ఏడాదికి లక్షల్లో ఖర్చు.**

**మూన్నాళ్ళ ముచ్చటగా**

**వెలుగుతున్న సిగ్నల్ లైట్స్.**

**సిగ్నల్ లైట్స్ మరమత్తులు**

**పట్టించుకొని అధికారులు.**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 13 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ , మునిసిపల్ ఆఫీస్ పరిసరాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ గందరగోళం సృష్టిస్తున్నాయి. గ్రీన్ సిగ్నల్ వెలిగిన వెంటనే రెడ్, ఆ వెంటనే మళ్లీ గ్రీన్ ఇలా ఎటువంటి క్రమం లేకుండా మారుతున్న సిగ్నల్స్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిగ్నల్స్ సరిగ్గా పని చేయకపోవడంతో జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోతుంది. కొందరు డ్రైవర్లు గ్రీన్ పడిందని ముందుకు కదలగానే వెంటనే రెడ్ వెలగడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వెనుక వాహనాలు కూడా అకస్మాత్తుగా ఆగాల్సి వస్తోంది.

**వాహనదారులు చెబుతున్నదేమంటే** "సిగ్నల్ సరిగా పని చేయడం లేదు. గ్రీన్ వచ్చిన వెంటనే రెడ్ పడుతోంది. ఇలా ఉండటంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. సిగ్నల్ దాటి వెళ్లితే పోలీస్ ఫైన్ పడుతుందేమోనని భయపడుతున్నాం" అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తరచూ పద్మావతి నగర్ మున్సిపల్ ఆఫీస్ వద్ద గల ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా పని చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సిగ్నల్స్‌ను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ట్రాఫిక్ నియంత్రణను పటిష్టం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ట్రాఫిక్ సిగ్నల్స్ కు ప్రతి ఏటా లక్షల్లో అధికారులు ఖర్చుచేస్తున్నారు.ఖర్చు చేసిన మున్నాళ్లకే యధావిధిగా మారిపోతుంది.ఎప్పుడు పనిచేస్తాయో అర్థం కానీ పరిస్థితి.గ్రీన్ లైట్ వెలిగిందని ముందుకు పోయే లోపు రెడ్ లైట్ వెలగడం ,గందర గోళంతో అన్ని వైపుల వచ్చే వాహన దారులు కన్ఫ్యూజ్ అయి ప్రమాదాలకు గురవుతున్నారు.అధికారులు నిర్లక్షం వహించకుండా వెంటనే మరమ్మతులు చేయాలని పేర్కొంటున్నారు.మరో విచిత్రం ఏమంటే సిగ్నల్ లైట్స్ వద్ద ఎడమవైపు వాహనాలు వెళ్ళ వచ్చు అని వాహనదారులకు తెలుసో లేదో తెలియదు కానీ ఎడమవైపు నిలబడుతూ ఇబ్బందులు పెడుతున్నారు.లైసెన్స్ తీసుకునే తప్పుడు ఎడమ వైపు వాహనదారులు వెళ్లవచ్చు అనేది తెలియకపోవడం విశేషం.మరో విశేషం ఏమంటే పద్మావతి నగర్ ఆర్చి వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాలకు ఫైన్ లు మాత్రమే వేస్తారు కానీ అక్కడే ఎడమవైపు వాహనాలు నిలబడిన వారికి చెప్పడం మా పని కాదని కేవలం ఫైన్లు మాత్రమే వేస్తాం అన్న ధోరణిలో ఉన్నారు.ట్రాఫిక్ పోలీసులు ఎడమవైపు వాహనాలు నిలబెట్టకుండా వారికి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెపితే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

# నగరంలో అనధికారిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు.

**బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల**

**పరిష్కారానికై కంట్రోల్ నెంబర్ ఏర్పాటు.**

**అనధికారిక ఇంటి పన్నులు మార్పు చేసిన**

**వారిపై చర్యలు తీసుకుంటున్నాం.**

**సమస్యల పరిష్కారానికై కంట్రోల్ నెంబర్ :**

**0877- 2256766.9000822909**

తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక నగరంలో తోపుడు బండ్లు, పండ్లు, పూలు, కూరగాయలు విక్రయించే వారి వద్ద ఎవరైనా అనధికారిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సమస్యల పరిష్కారం కొరకు కంట్రోల్ నెంబర్ 0877- 2256766, 9000822909 కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. నగరంలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండర్ దారుడు సకాలంలో నగదు చెల్లించనందున టెండర్ రద్దు చేశారని తెలిపారు. కావున మార్కెట్ కు సంబందించిన వసూళ్లు నగరపాలక సంస్థ సిబ్బంది చేస్తున్నారని తెలిపారు. ప్రయివేట్ వ్యక్తులు ఎవ్వరూ కూడా నగరంలో పన్నులు పండ్లు, కూరగాయలు, పూలు, తోపుడు బండ్ల వారి వద్ద నగదు వసూలు చేయరాదనీ తెలిపారు. నగరపాలక సంస్థ సిబ్బంది కాకుండా ప్రయివేట్ వ్యక్తులు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారానికి కంట్రోల్ నెంబర్. బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ నెంబర్లు 0877- 2256766, 9000822909 ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరి దరఖాస్తులు ఎక్కడ ఉన్నాయి, ఎన్ని రోజుల్లో క్లియర్ అవుతాయి వంటి సమాచారం ఎప్పటికప్పుడు తెలిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే అవసరమైన పత్రాల సమాచారం కూడా అందించి త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలే స్వయంగా ఆన్లైన్ ద్వారా బి.పి.ఎస్. ధరఖాస్తులు చేసుకునేలా అవకాశం కల్పించిందని తెలిపారు. డ్రాయింగ్ తయారు చేసి ధ్రూా దరఖాస్తు దాఖలు చేయుటకు మీ దగ్గరలోని సచివాలయ ప్లానింగ్ సెక్రటరీని సంప్రదించాలని, డ్రాయింగ్ తయారికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరము లేదని తెలిపారు.

**అనధికారిక ఇంటి పన్నులు మార్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం.** నగరపాలక సంస్థ పరిధిలో కొంతమంది ఇంటి యజమానులు ఎటువంటి పత్రాలు సమర్పించకుండా పన్నులు మార్చుకున్న, మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ వెబ్ సైట్ లో మార్పుదల చేసినట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై విచారణ



చేయాలని సైబర్ క్రైమ్ అధికారులకు, పిర్యాదు చేశామని తెలిపారు. ఇంటి పన్నులు మార్పుదల చేసిన చేసుకున్న ఇంటి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ కి పిర్యాదు చేశామని తెలిపారు. వెబ్ సైట్ లో పేర్లు మార్చిన సిబ్బంది పై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బిపిఎస్, ఎల్.ఆర్.ఎస్. ధరఖాస్తుల నమోదు, మార్కెట్ లో అనదికారిక వసూళ్లు, ఇంటి పన్నుల మార్పు తదితరాలకు సిబ్బంది ఎవరైనా నగదు అడిగినా, నగరపాలక సంస్థ లోశాఖపరమైన సమస్యలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 0877-2256766, 9000822909 ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

# ఈట్ స్ట్రీట్ పనులను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య.



తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా అచ్యుత దేవరాయ మార్గంలో ఏర్పాటు చేస్తున్న ఈట్ స్ట్రీట్ పనులను శుక్రవారం ఉదయం అధికారులతో కలసి కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. ఈట్ స్ట్రీట్ ప్లాన్, వాహనాల పార్కింగ్ తదితర వాటిని అధికారులు కమిషనర్ కు వివరించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ సుమారు కోటి రూపాయల భారత ప్రభుత్వ నిధులతో 12 కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో నీటి కొళాయి, షింక్, విద్యుత్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. వాహనాలు పార్క్ చేసుకునేందుకు పార్కింగ్ స్థలం, పిల్లలు ఆడుకునేందుకు ప్లే జోన్, వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరంలోని ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేసి, ఈట్ స్ట్రీట్ లోని షాపులను బహిరంగ వేలం ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి.ఈ.వెంకట ప్రసాద్, ఉన్నారు.



# సమన్వయంతో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలి:

**ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి**




నంది పత్రిక -ప్యాపిలి రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి తెలుగుదేశం పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో పార్లమెంట్ పార్టీ కమిటీ సభ్యులకు నిర్వహించిన పార్లమెంట్ పార్టీ కమిటీ విధులు-బాధ్యతలు మరియు క్యాడర్ నిర్వహణ నాయకుడి లక్షణాలు అనే అంశాలపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతానికి బూత్ స్థాయిలో క్రమబద్ధమైన వ్యవస్థ ఉండటం ఎంతో కీలకమని పేర్కొన్నారు. బూత్ మేనేజ్మెంట్,ఎన్నికల వ్యూహాల అమలులో కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలిపార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన గుర్తు చేశారు. నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీకి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పార్టీ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నేతలు మరియు ఇతర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# భగవంతుని సేవలో భక్తులు భక్తుల సేవలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్.





సిరివెళ్ల (నంది పత్రిక ) మహాశివరాత్రి పర్వదినాన పాదయాత్రలకు విస్తృతస్థాయిలో ఉచిత ప్రాథమిక వైద్య శిబిరాలు మరియు బట్టర్ మిల్క్, వాటర్ మిలన్ అందజేత.

**విశేష సేవలు అందిస్తున్న దానధర్మ చారిటబుల్ ట్రస్ట్** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఉచిత మందుల పంపిణీ మరియు బటర్ మిల్క్, వాటర్ మిలన్ దాతల సహకారంతో దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్గమధ్యంలోని కీలక ప్రాంతాలలో అందజేయడం జరుగుతుంది. భక్తులకు మినరల్ వాటర్ మరియు దాహం అలసట తగ్గించేలా బట్టర్ మిల్క్, వాటర్ మిలన్ అందజేస్తున్నారు. గత నాలుగు రోజులుగా నందికొట్కూరు తాలూకా పారుమంచాల చెక్ పోస్ట్ నందు కాలినడకన వెళ్లే భక్తులకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ సేవా కార్యక్రమంలో దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ సూర్య రత్నాల మరియు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సేవా సభ్యులు పాల్గొంటున్నారు.

# కోటపాడులో వీధి వీధినా విద్యుత్ కాంతులు.



శిరివెళ్ల ( నంది పత్రిక) :- సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో వీధీవీధినా విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ డి హుసేన్ బి గుర్రప్ప తెలియజేశారు. శుక్రవారం గ్రామంలోని పలు వీదులు విద్యుత్ స్తంభాలు పర్యవేక్షించి ఎల్ ఇ డి బల్బులను అమర్చినట్లు సర్పంచ్ . మరియు గ్రామ నాయకులు వంకధార సుబ్బాసత్యనారాయణ.తెలియజేశారు. గ్రామంలో సుమారు 20 కి పైగా స్తంభాలకు విద్యుత్ బల్బులు మరమ్మత్తులకు గురి కావడంతో వాటి స్థానంలో నూతన ఎల్ ఇ డి బల్బులను అమర్చమన్నారు. కొన్ని విద్యుత్ స్తంభాలకు తీగలు పని చేయకపోవడం వల్ల నూతన విద్యుత్ బంతి కేబుల్ తీగలు అమర్చినట్లు డి హుసేన్ బి గుర్రప్ప పేర్కొన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని కోటపాడు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు విద్యుత్ కాంతులకు కృషి చేసినట్లు సర్పంచ్ . గ్రామపంచాయతీ సెక్రెటరీ. మనోహర్ తెలియజేశారు.

# సచివాలయంలో జీతం... ప్రవేటు కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం.

**సచివాలయాలపై పర్యవేక్షణ నిల్.**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 13 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్ లోని 37 వార్డ్ సచివాలయంలో ఒక ఉద్యోగి జీతం సచివాలయంలో తీసుకుంటూ విధులు మాత్రం ఒక ప్రవేటు కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్ 37 వార్డులో పనిచేస్తున్న ఒకరు రోజు యధావిధిగా సచివాలయంలో హాజరు పట్టి లో సంతకం చేసి ,పద్మావతి నగర్ లోని ఒక ప్రవేటు కళాశాలలో పార్ట్ టైమ్ లెక్చరర్ గా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది.సచివాలయం ఉద్యోగిగా ఉంటూ ప్రతినెల జీతం తీసుకుంటూ ప్రభుత్వ విధులు నిర్వహించకుండా ఆ ప్రవేటు కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం చేయడం విశేషం.గతంలో సైతం ఆ ప్రవేటు కళాశాలలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారు లెక్చరర్ గా పనిచేయడం విశేషం.పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయంలో పనిచేసేవారు సర్వేల కు వెళుతున్నామని చెపుతున్నారు కానీ కార్యాలయంలో కనీసం ఒక్కరు లేకుండా వెళ్ళడం ఎంతవరకు సబబు.కార్యాలయంలో విలువైన వస్తువులు పొరపాటున చోరికి గురి అయితే బాధ్యులు ఎవరు.సచివాలయాలపై పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.చివరకు సచివాలయంలో రెవెన్యూ,టౌన్ ప్లానింగ్ సంబంధించిన ఫైల్స్ అప్లోడ్ చేయాలంటే చెయ్యి తడపందే పనులు చేయడం లేదు.ప్రశ్నించేవారు,చర్యలు ,తనికీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారిపోయింది.సచివాలయం ఉద్యోగి ఒక ప్రవేటు కళాశాలలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని కొందరు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న,తహాశీల్దార్ పత్తి శ్రీనివాసుల దృష్టికి తీసుకొని వెళ్లినట్టు తెలిసింది.

# ఊరి బడిని కాపాడుదాం పోస్టర్ ఆవిష్కరణ



మద్దిపాడు ఫిబ్రవరి 13నంది పత్రిక : ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం యూటీఎఫ్ చేస్తున్న దశల వారీ కార్యక్రమాలలో భాగంగా మద్దిపాడు మండల శాఖ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ అనిల్ కుమార్ చేతుల మీదుగా ఊరి బడిని కాపాడుదాం పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కటారి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ చేస్తున్న పోరాటానికి అందరూ సహకరించాలని అన్నారు.అనంతరం మద్దిపాడు ఉన్నత పాఠశాల,చిలకపాడు ఉన్నత పాఠశల,మద్దిపాడు క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు మరియు మద్దిపాడు ప్రధాన కూడళ్లలో ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్లను ప్రదర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎన్.సుబ్బరాయుడు, జీ.వి.సుబ్బారెడ్డి,పీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

నందిపత్రిక –డోన్ కర్నూలు నగరంలోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్ ఆదివారం ఒక వేడుకకు వేదికైంది. ఆకేపోగు ప్రభాకర్ కుమార్తె వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి డోన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీమతి కోట్ల సుజాతమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆత్మీయ పలకరింపులు కార్యక్రమానికి విచ్చేసిన సుజాతమ్మ ఆకేపోగు ప్రభాకర్ మరియు వారి కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె వివాహ వేడుకలో పాల్గొని, నూతన వధూ వరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కొత్త జీవితంలోకి అడుగుపెడు తున్న జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



## నిజమైన నాయకత్వానికి ప్రతీక పవన్ కళ్యాణ్ : శీలంశెట్టి లక్ష్మయ్య




**పోరుమామిళ్ల ఫిబ్రవరి 13 (నంది పత్రిక)** ప్రస్తుత రాజకీయాల్లో దోచుకుందామాదాచుకుందామా అన్న ఉద్దేశంతో పాలన సాగుతున్న సమయంలో, ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ న్యాయం చేస్తున్న నాయకుడు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాత్రమేనని లక్ష్మయ్య అన్నారు. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైనా రాజకీయాల నుంచి తప్పుకోకుండా 2024 ఎన్నికల్లో నిలబడి గెలిచి ప్రజలకు న్యాయం చేస్తున్నారని కొనియాడారు. ఒక వ్యక్తికి న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్న నిజాయితీగల నాయకుడు పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో స్కూల్ పిల్లలు (మాకు రోడ్లు వేయండి సారు )అన్న వీడియో పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లగానే తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రతి నాయకుడు ఇదే విధంగా ప్రజా సమస్యలపై స్పందిస్తే, రాష్ట్రంలో గుంతలతో నిండిన రహదారులు మాయమవుతాయని అన్నారు. కావున ఓటర్లు ఇప్పటికైనా గ్రహించి నిజమైన నాయకుడిని గుర్తించి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రమంతా జనసేన వైపు చూస్తోందని, రాబోయే రోజుల్లో పేద ప్రజలకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## అక్రమ సంబంధం కేసులో లంచం మేసిన పోలీసులు

### ఎసిబి దాడిలో అడ్డంగా దొరికిపోయిన ఖాకీలు

రంపచోడవరం నియోజకవర్గం గంగవరం పోలీస్ స్టేషన్‌లో అవినీతి బండారం బహిర్గతమైంది. అక్రమ సంబంధానికి సంబంధించిన కేసులో ముద్దాయి నుంచి లంచం డిమాండ్ చేసి.. నగదు స్వీకరిస్తూ గంగవరం ఎస్సై బి.వెంకటేష్, కానిస్టేబుల్ వీరబాబులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఏసీబీ అధికారుల దాడులు పోలీసు వర్గాల్లో గుబులు పుట్టిస్తున్నాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవర డివిజన్లోని గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన అనార్కలి అనే యువతితో దాసరి శివకుమార్ అనే వ్యక్తి అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అతని మొదటి భార్య గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎస్సై వెంకటేష్ ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో కేసు విషయాన్ని సర్దుబాటు చేయాలంటే రూ.20 వేల రూపాయిలు లంచంగా ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేసినట్లు సమాచారం. డబ్బు ఇవ్వకపోతే కేసును కఠినంగా నమోదు చేస్తామని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక నగదు అందేంతవరకు శివకుమార్ సెల్‌ఫోన్‌ను తన వద్దనే ఉంచుకున్నట్లు బాధితుడు తెలిపారు. డబ్బు డిమాండ్‌పై విసిగిపోయిన శివకుమార్.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ.. డీఎస్పీ డాక్టర్ కిషోర్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ట్రాప్ ఆపరేషన్‌కు రంగం సిద్ధం చేసింది. ఏసీబీ అధికారులు ముందుగా సాక్షుల సమక్షంలో నగదు నోట్లపై రసాయన పౌడర్ పూసి బాధితుడికి అందించారు. గంగవరం పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ముందుగా ఎ÷-లాన్ చేసిన విధంగా శివకుమార్ కానిస్టేబుల్ వీరబాబుకు రూ.15,000 నగదు అందజేశాడు. నగదు స్వీకరించిన వెంటనే అక్కడే గస్తీ కాస్తున్న ఏసీబీ అధికారులు దాడి చేసి కానిస్టేబుల్ వీరబాబును అదుపులోకి తీసుకున్నారు.

## పుణ్యక్షేత్రం లో విధులకు పంచాయతీ కార్యదర్శులు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 13:** మహాశివరాత్రి సందర్భంగా పుణ్యక్షేత్రాలలో విధులు నిర్వహించాలని జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొద్దిరోజుల క్రితం శ్రీశైలంలో శివ భక్తుల తొక్కిసలాటలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా రెండు రోజుల క్రితం అధికారులందరికీ ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బండి ఆత్మకూరు మండలంలో పనిచేస్తున్న పలువురు కార్యదర్శులను మహానంది పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహించాలని నంద్యాల ఆర్డిఓ ఆదేశాల మేరకు పంచాయతీ డి ఎల్ పి ఓ రాంబాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. బండి ఆత్మకూరు ఈవో ఆర్ డి పురుషోత్తంతోపాటు బండి ఆత్మకూరు పార్నపల్లె పెద్దదేవలాపురం జిసి పాలెం బండి ఆత్మకూరు టు సచివాలయాలలో కార్యదర్శులుగా పనిచేస్తున్న అక్బర్, ఇర్ఫాన్, బాలకృష్ణ, సురేష్, సిరి లకు మహానంది పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం నాటి నుండి 18వ తేదీ వరకు కార్యదర్శులు అందరూ మహానంది పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా కలెక్టర్ ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు ఎంపీడీవో గాయత్రి, ఇ ఓ ఆర్ డి అన్నం పురుషోత్తం, శుక్రవారం ఓంకారం పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత దేవాదాయ శాఖ సిబ్బందికి సూచనలు జారీ చేశారు.

# గ్రామవార్డు సచివాలయాల పేర్ల మార్పు బాధాకరం మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

### సచివాలయ వ్యవస్థను బలహీనపరుస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలపై విమర్శలు



**పోరుమామిళ్ల ఫిబ్రవరి 13 (నంది పత్రిక ):** గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను మార్చడం ప్రజాపాలన వ్యవస్థను దెబ్బతీసే చర్యగా మారుతోందని మాజీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ సచివాలయాన్ని “స్వర్ణ గ్రామం”, వార్డు సచివాలయాన్ని “స్వర్ణ వార్డు”గా పేరు మార్చడం ద్వారా సచివాలయ వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో అడుగు ముందుకేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని విధాల పరిపాలన అందుబాటులో ఉండేదని తెలిపారు. 11 నుంచి 13 శాఖలకు చెందిన ఉద్యోగులను ఒకే నోటిఫికేషన్ ద్వారా నియమించి దాదాపు ఒక లక్ష 40 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం, రెండు లక్షల 50 వేల వాలంటీర్లను నియమించడం దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయమని అన్నారు.ప్రస్తుతం సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులను తగ్గించి ఇతర శాఖలకు పంపడం జరుగుతోందని, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ గ్రంథాలయాలు, పాల కేంద్రాలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న ప్రవేశపెట్టిన ప్రజలకు ఉపయోగపడే పథకాల పేర్లను తొలగించడం జరుగుతోందని, నాడునేడు, ఆరోగ్యశ్రీ, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, కాపు నేస్తం వంటి సేవలు నిలిపివేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే సచివాలయ వ్యవస్థ మరింత వెలుగొందేదని, భవిష్యత్తులో సచివాలయాల ద్వారానే భూముల నమోదు, బస్సు, రైలు, విమాన టికెట్ల వంటి సేవలు గ్రామ స్థాయిలో అందించే వ్యవస్థ అమలయ్యేదని చెప్పారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం

## బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత రక్త పరీక్షలు

### సురేంద్రనగర్ బాలుర పాఠశాలలో ఆరోగ్య శిబిరం



**బద్వేలు ఫిబ్రవరి 13 (నంది పత్రిక ):** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో 13/2/26 న సురేంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో, సురేంద్రనగర్ వార్డు సచివాలయం పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల, బద్వేల్‌లో ఉచిత రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ వై. శ్రీనివాసులు ఆధ్వర్యంలో, బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడుతూ, 14 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల బాలికలు మరియు మహిళలకు ఉచితంగా హీమోఫిలియా, సికిల్ సెల్ అనీమియా వంటి రక్త సంబంధిత వ్యాధుల గుర్తింపునకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేయబడుతున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్య ఆరోగ్య విద్యాధికారి బి. వెంకయ్య, ఆరోగ్య సహాయకుడు వి. జనార్ధన రావు, పాఠశాల ఇన్‌చార్జి ఏ. రామయ్య, ఉపాధ్యాయులు, బెంగళూరు నుంచి వచ్చిన వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. బాలికలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రక్త పరీక్షలు చేయించుకున్నారు.



## 15న నంద్యాలలో సేవాలాల్ మహారాజ్ జయంతోత్సవం

### -ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 13. (నంది పత్రిక ):** బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతోత్సవ సందర్భంగా భోగ్ బండారో పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు.శుక్రవారం నంద్యాల పట్టణంలోని గోర్ బంజారా సంస్కృతి సేవాలాల్ కమిటీ ఆవరణంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా రాజు నాయక్ మరియు కమిటీ సభ్యులు మాట్లాడుతూ. బంజారా జాతి పురోగతి సాధించాలంటే సాంప్రదాయ పద్ధతులను ఆధునిక జీవన విధానాన్ని కలగలిపి జీవించాలని బంజారాలకు మార్గోపదేశం చేసిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ఆయన 1739 సంవత్సరాల కిందట జన్మించి ఎన్నో మహిమలు చూపారని చరిత్ర చెబుతోంది అన్నారు. సుగాలి జాతి జాగృతి కోసం ఆరాటపడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొంది ప్రతి తండాలో బంజారాలచే పూజలు అందుకుంటున్న సద్గురు సత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతోత్సవాల సందర్భంగా ప్రతి తండాలో ప్రతి ఇంట్లో ఈ మూడు రోజులు పాటు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేయాలన్నారు. అంగరంగ వైభవంగా 287వ జయంతి వారోత్సవాలను నంద్యాల పట్టణంలోని వెంకటాచలం కాలనీ నందు బంజారా స్థల ఆవరణంలో ఈనెల 15వ తేదీన ఆదివారం సాయంత్రం 4.00 గంటలకు మొట్టమొదటిసారిగా బంజారా సాధులు, సంతుల చేతుల మీదుగా భోగ్ బండారో పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ పిలుపునిచ్చారు.సేవాగాడ్ లో ఈనెల జరిగే సేవాలాల్ మహారాజ్ జయించోత్సవాలను పురస్కరించుకొని సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా ధర్మ రక్ష సమితి జిల్లా అధ్యక్షుడు చందు నాయక్, గౌరవాధ్యక్షుడు హత్తి నాయక్, అడ్వకేట్ విజయ నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి నాయక్, డాక్టర్ కాంతారావు నాయక్, కోశాధికారి మత్రు నాయక్, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిరామ్ కళాశాల విద్యార్థులకు పెట్టుబడి రంగం పై అవగాహన



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 13. (నంది పత్రిక ):** శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో ఎంబీఏ విద్యార్థులకు, ఫైనాన్సియల్ విస్డం ఫర్ ఫ్యూచర్ బిజినెస్ లీడర్స్ అను అంశంపై రెండు రోజులు (12.02.2025 మరియు 13.02.2026) వర్క్‌షాప్‌ను నిర్వహించారు, ఈ కార్యక్రమం ఆదిత్య బిర్లా ఫౌండేషన్ మరియు నిస్ఎం అసోసియేషన్ తో నిర్వహించబడినది. డాక్టర్ జె. మూర్తీ ప్రధాన అతిథి మరియు రిసోర్స్ పర్సన్గా వ్యవహరించారు. అతను సెబీతో అనుబంధించబడిన సెక్యూరిటీ మార్కెట్ ట్రైనర్. ఈ వర్క్‌షాప్ నందు పెట్టుబడి అంటే ఏమిటి, ఎక్కడ పెట్టుబడి పెట్టాలి, పెట్టుబడి ఉన్నప్పుడు పరిగణించవలసిన అంశాలు ఏమిటి, పెట్టుబడిలో నష్టాలు ఏమిటి, సెక్యూరిటీస్ మార్కెట్ ప్రాముఖ్యత, పెట్టుబడులలో జాగ్రత్తలు, మూలధన మార్కెట్‌లో అవకాశాలు, మరియు విద్యార్థులు అభ్యాసం చేయగలిగే రంగాలపై వివరణాత్మకంగా ప్రసంగించారు. ఎంబీఏ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.విభాగాధిపతి డాక్టర్ ఎ కె నీరజా రాణి మాట్లాడుతూ – ఈ వర్క్‌షాప్, విద్యార్థులకు పెట్టుబడి రంగం పై విస్తృతమైన అవగాహన కల్పించిందని, విద్యార్థులలో ఆర్థిక జ్ఞానాన్ని పెంపొందించడంలో, పెట్టుబడులపై అవగాహనలో దోహదపడిందని తెలిపారు.విద్యార్థులకు సిద్ధాంత జ్ఞానం మాత్రమే కాకుండా, ప్రాక్టికల్ అవగాహనకు కూడా ఇవి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.




## దోమల నియంత్రణ ప్రజల అందరి బాధ్యత

### టి. నరసింహా రెడ్డి సబ్ - యూనిట్ ఆఫీసర్




**బద్వేల్ ఫిబ్రవరి 13 (నంది పత్రిక ):** దోమల నియంత్రణ ప్రజల అందరి భాద్యత అని, ప్రతి ఒక్కరు దోమతెరలు వాడటం శ్రేయస్కరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహా రెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో, కొత్తచెరువు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఇల్లులు తిరిగి బానలు, ఫ్రిజ్జులు, డ్రమ్ములు, టైర్లను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. కాచి వడగట్టిన నీటిని త్రాగాలని సూచించారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి, వేల రూపాయలు పోగొట్టుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి వెంగయ్యలు మాట్లాడుతూ, దోమల వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. ఏ జబ్బులు వచ్చిన భయపడవలసిన అవసరం లేదన్నారు. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారన్నారు. 104, విలేజ్ హెల్త్ క్లినిక్ లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో ప్రతి ఒక్కరూ వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సిహెచ్ఓ వీణ, ఏఎన్ఎం దీపిక, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,.



## సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు

**కొత్తపల్లి – నంది పత్రిక :** మహాశివరాత్రి పర్వదినం దగ్గర పడుతుంది. దీంతో ఆలయాలకు భక్తుల రద్దీ పెరుగుతుంది. మండలంలోని సప్తనది సంగమేశ్వరంలోని ఎగువ పుష్కం ఘాట వద్ద ఉన్న ఉమామహేశ్వ రాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. శివలింగానికి సప్తనదీ జలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజకార్యక్రమాలు జరుపుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద భక్తులతో సందడి నెలకొంది.



## బుచ్చయ్య తాతా అంటూ లోకేశ్ పలకరింపు

### సీనియర్ ఎమ్మెల్యేతో లోకేశ్ ఆప్యాయ సంభాషణ

ఏపీ అసెంబ్లీ సమావేశాలు మూడోరోజు శుక్రవారం లాబీల్లో ఆసక్తికర సంఘటన కనిపించింది. ఈ సందర్భంగా తెలుగుదేశం రాజమహేంద్రవరం రూరల్ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. బుచ్చయ్య తాత అంటూ ఆప్యాయంగా పలకరించారు. లాబీల్లో బుచ్చయ్యను ఆలింగనం చేసుకొని సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. క్కనే ఉన్న మీడియా ప్రతినిధులకు చూపించి ఆయన కళ్లజోడు గోల్డ్, వాచ్ గోల్డ్, రింగ్ గోల్డ్, ఫోన్ గోల్డ్, పెన్ గోల్డ్ అంటూ ఛలోక్తులు విసిరారు. మనిషి కూడా గోల్డ్ అంటూ కితాబిచ్చారు. కానీ ఆయన వేసుకున్న షర్ట్ మాత్రం పూర్తి స్టైలిష్ షర్ట్ అని చమత్కరించారు. ఈలోపు వెనుక నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందిస్తూ.. ’ రాజకీయాల్లో బుచ్చయ్య గారు ఓల్డ్’ అంటూ చమత్కరించారు. దీంతో లోకేశ్ పక్కనే ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ముఖాల్లో నవ్వులు విరబూశాయి. ఈ క్రమంలో లాబీల్లో కాసేపు సందడి వాతావరణం నెలకొంది.

# బండి ఆత్మకూరులో కళాశాల వార్షికోత్సవం





**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 13:** సమాజం గుర్తించేలా విద్యార్థులు ఎదగాలని నంద్యాల జిల్లా బిజెపి కిషన్ మోర్చా అధ్యక్షులు బిజ్జం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం బండి ఆత్మకూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా బిజ్జం వెంకట సుబ్బారెడ్డి పాల్గొని ప్రసంగించారు సమాజంలో మనల్ని మనం నిరూపించుకోవాలన్నప్పుడు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నామా లేదా అని ప్రశ్నించుకోవాలన్నారు. తల్లిదండ్రులు గర్వపడే విధంగా గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. భారతదేశంలో గొప్పగా శక్తివంతమైన నాయకులుగా ఎదిగిన రాజకీయ ప్రముఖులు, అధికారులందరూ గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారే అని అన్నారు.

ఆడపిల్లలు కాలేజీ దశ నుండి వెళ్లిపోయిన తర్వాత, తమకు పెళ్లి చేసి అత్తారింటికి పంపుతారనే భావన చాలా మందిలో ఉంటుందని, దీనితో చాలామంది నిరాశకు గురి అవుతూ ఉంటారని, మీరు చదువుకున్న చదువు భవిష్యత్తులో మీ పిల్లలకు ఉపయోగపడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమం కొరకు కోట్ల రూపాయలను ఖర్చు పెడుతూ ఉందని, పాఠశాలలతో పాటు కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారని బిజ్జం చెప్పారు. కళాశాలలో లెక్చరర్లు విద్యార్థులకు విద్యా జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నారని, విద్యార్థులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి సైతం మంచి గుర్తింపు వచ్చేలా విద్యార్థులు మెలగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సోమశేఖరప్ప, ఎర్రగుంట్ల ఫిజిక్స్ అధ్యాపకులు బాలచంద్రుడు, సింగవరం,కరిమెద్దల, ఎర్రగుంట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, మధుసూదన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి స్థానిక కళాశాల ప్రిన్సిపల్ వెంకటనారాయణ, మండల విద్యాశాఖ అధికారులు యశోద, మోహన్ రెడ్డి,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పలువురు అతిథులను కళాశాల యాజమాన్యం శాలువాలతో సన్మానించారు.

# విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పాలాభిషేకం

## రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల



**ఎమ్మిగనూరు ఫిబ్రవరి 13,(నంది పత్రిక)** ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ని ఫంక్షన్ హాల్ నుండి పద్మశ్రీ మాచాని సోమప్ప సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి భారీ కృతజ్ఞత ర్యాలీ నిర్వహించబడింది .రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులకు వరంగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా రాష్ట్ర ఐటీ & విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి థాంక్యూ నారా లోకేష్ అన్న అంటూ విద్యార్థులు,నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు.పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్,మండల మరియు పట్టణ కమిటీ అధ్యక్షులు,గ్రామ మరియు వార్డు కమిటీ సభ్యులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీశైల పాదయాత్రకు వెళ్తున్న శివ స్వాములు భక్త బృందం



**కొత్తపల్లె - నంది పత్రిక :** శ్రీశైలం పాదయాత్రకు కొత్తపల్లి శివస్వాములు భక్త బృందం శుక్రవారం ప్రారంభం కావడంతో శ్రీ పార్వతి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో శివస్వాములు అందరూ కలిసి పాల అభిషేక పూజలు కుంకుమార్చన రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామ పురోహితులు యాదవేని లక్ష్మీ నరసయ్య శర్మ శివ స్వాములు అందరికీ ఇరుముడి కట్టి కాయ కర్పూరం నిర్వహించారు అనంతరం శివ స్వాములు మొత్తం 60మంది అందరూ కలిసి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ నలుమూలల శ్రీ పార్వతి సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, శ్రీ సుంకులమ్మ దేవి ఆలయం, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, శ్రీ పార్వతి దేవి సమేత శ్రీ తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం, శ్రీ ఎల్లమ్మ అమ్మవారు ఆలయం రామాలయం, రాధా క్రిష్ణ ఆలయం, శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీ సరస్వతి దేవి అమ్మవారు శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం శివస్వాములు అందరూ తిరిగి కాయ కర్పూరాలు ఓం నమశ్శివాయ అంటూ పాడుకుంటూ గ్రామ నలుమూలల తిరిగి గ్రామ శివారు నుంచి శ్రీశైల పాదయాత్రగా శివ స్వాములతో సహా గ్రామ ప్రజలందరూ కాలినడకన బయలుదేరారు.



# దంతాలు ఆరోగ్యంగా ఉంటే.. రోగాలు దరిచేరవు.

## ఉచిత దంత వైద్య శిబిరానికి భారీ స్పందన.



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 13 ( నంది పత్రిక )** దంతాలు ఆరోగ్యంగా ఉంటే రోగాలు దరిచేరవు అని వైద్యులు గురుప్రసాద్,సుజాత,కావ్య పేర్కొన్నారు.ఎన్జీవోస్ కాలనీ జేవిఆర్ నగర్ హౌసింగ్ బోర్డ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆపోజిట్ హోమ్ శాంతి బోర్డు ఎదురుగా ఫంక్షన్ హాల్ నందు రమణి దంత వైద్యశాల వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరమును ఏర్పాటు చేశారు. ఈ శిబిరములో డాక్టర్ గురు ప్రసాద్ , డాక్టర్ సుజాత , డాక్టర్ కావ్య వైద్యసేవలు చేశారు. ఉచిత వైద్య శిబిరంకు వచ్చిన రోగులకు వైద్యులు మంచిగా దంత పరిశీలన చేసి వారికి ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించారు. అవసరమైన వారికి ఆపరేషన్ కు 20% డిస్కౌంటీ ఇస్తామని పేర్కొన్నారు. ఏదైనా చిన్న చిన్న దంత సమస్యలు ఉన్నవారికి అక్కడే ట్రీట్మెంట్ చేసి ఉచిత మందులు అందించారు. ఈ ఉచిత శిబిరము లో హౌసింగ్ బోర్డ్ సొసైటీ అధ్యక్షులు కే నారాయణ ఉపాధ్యక్షులు తోట. రామయ్య సెక్రెటరీ కరీముల్లా గారు డైరెక్టర్స్ నీలి చంద్రశేఖర్ మాజీ సెక్రటరీ భాస్కరు మేనేజర్ రమణ మాజీ డైరెక్టర్ మల్లేష్, మొదలు వారు పాల్గొన్నారు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది.



# 15 నుంచి కొలను భారతిలో ఉచిత అన్నదాన కార్యక్రమం

**కొత్తపల్లి - నంది పత్రిక :** శివరాత్రి పర్వదినమును పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొలను భారతి పుణ్యక్షేత్రంలో ఈనెల 15 నుంచి 16 వరకు శాలివాహన కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కమిటీ సభ్యులు పెద్దకోటయ్య, కృష్ణయ్య. పుల్లయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు, రమణ, వెంకటస్వామిలు శుక్రవారం తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా కొలను భారతి పుణ్యక్షేత్రంలో జాగరణ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులకు అల్పాహారము, ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 15,16 రెండు రోజులపాటు క్షేత్రంలో అల్పాహారము. అన్నదాన కార్యక్రమంలో ఉంటాయని చెప్పారు. ప్రతి ఏడాది శాలివాహన సంఘం ఆధ్వర్యంలో దాదాపు 15 ఏళ్ల నుంచి శివరాత్రి సందర్భంగా క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శ్రీశైల దేవస్థానంలో కొలనుభారతి క్షేత్రం కలిసినందున అక్కడి అధికారులు క్షేత్రంలో నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు ప్రత్యేక స్థలం కేటాయిస్తే నిత్యన్నదాన సత్రం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉనామని తెలిపారు. శ్రీశైలం దేవస్థానం అధికారులు ఈ విషయంపై దృష్టి దృష్టి సారించాలన్నారు.

# అంగన్వాడీ కేంద్రం తనిఖీ

## -ఎంపీడీఓ మేరీ



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని దుద్యాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ దాసరి మేరి శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లు, గుడ్లను, పరిసరాలను, పౌష్టికాహారం స్టాక్ను పరిశీలించారు. చిన్నారుల హాజరుపట్టిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారిని అంగన్వాడీ సిబ్బంది సురక్షితంగా చూసుకోవాలన్నారు. సమయానికి పౌష్టికాహారం అందించాలన్నారు. పాలు, గుడ్డు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. పరిసరాలను, వంటపాత్రలు, వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గుడ్లు ఉడికించే టప్పుడు బాగా ఉన్నాయా లేదా అని చూసుకొని చిన్నారులకు ఇవ్వాలన్నారు. చిన్నార్లు పట్ల జాగ్రత్తగ వ్యవహరించాలని సూచించారు.



# ఇంటర్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి..!!



## జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా

**కడప, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక:** రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను జిల్లాలో పటిష్టంగా చేపట్టాలని జేసీ డా. నిధి మీనా సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల సన్నద్ధత, మహాశివరాత్రి ఉత్సవాలలో వసతులు, భద్రతా ఏర్పాట్లు, సానుకూల ప్రజా దృక్పథం, డాక్యుమెంట్ అప్ లోడ్, కోర్టు బిల్డింగుల కోసం స్థల సేకరణ, కొత్త జిల్లాల్లో నూతన కోర్టు భవవనాల కోసం స్థల సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూమ్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరవ్వగా.. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు. సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో జేసీ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు.. ప్రధానంగా పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, సజావుగా గ్యాస్ సరఫరా, నాణ్యమైన విద్యుత్ సరఫరా, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణీకులకు సంతృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో అన్ని రంగాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై ప్రతి వారం ప్రగతి నివేదికలను అందజేయాలన్నారు. అలాగే.. ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చేపట్టాలన్నారు. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని 16 ప్రధాన శైవ క్షేత్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, ఎలాంటి కొరత లేకుండా వసతులను సమకూర్చేలా రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై దృష్టి, మాధకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# ఉచిత క్యూలైన్ ద్వారా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దర్శనం చేసిన జిల్లా కలెక్టర్




## సుమారు 20 నిమిషాల్లో మల్లన్న దర్శనం పూర్తి

## జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

శ్రీశైలం ఫిబ్రవరి 13 (నంది పత్రిక ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీశైలం దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉచిత క్యూలైన్ ద్వారా సాధారణ భక్తులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. ఉచిత దర్శన క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, శానిటేషన్ సదుపాయాలు, వైద్య సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లలో తాగునీటి సదుపాయం నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి కలుగుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకొని, అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రత్యేక దర్శనాల కంటే సాధారణ భక్తులకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన సమర్ధవంతమైన ఏర్పాట్ల ఫలితంగా సుమారు 20 నిమిషాల్లోనే శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దర్శనం పూర్తి చేయగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉచిత క్యూలైన్ ద్వారా భక్తులకు తక్షణ దర్శనం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. మహాశివరాత్రి వేళల్లో భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులు సంయమనం పాటిస్తూ, శివనామ స్మరణతో, దేవాలయ నియమ నిబంధనలు అనుసరిస్తూ దర్శనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




# శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ




శ్రీశైలం / నంద్యాల జిల్లా, ఫిబ్రవరి 13:-(నంది పత్రిక)

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించబడనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాన్ కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. పాగా అలంకరణ దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లను, భక్తుల రాకపోకల మార్గాలను, భద్రతా చర్యలను కలెక్టర్ మరియు ఎస్పీ సమగ్రంగా తనిఖీ చేశారు. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా బందోబస్తు తదితర అంశాలపై పోలీసు శాఖతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. భక్తుల ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలు అనుసరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, రెవెన్యూ, పోలీసు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# చంద్రపల్లిలో అట్టహాసంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ఊరేగింపు

నంది పత్రిక -ప్యాపిలి ప్యాపిలి మండలం చంద్రపల్లి గ్రామ పొలిమేరలో నూతనంగా వెలసిన శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ఊరేగింపు మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

**ప్రముఖుల భాగస్వామ్యం** ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా లక్ష్మీనారాయణ యాదవ్ గ్రామ మాజీ సర్పంచ్ జయసుధ పాల్గొన్నారు. వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, స్వామివారి ఆశీస్సులు గ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

**కన్నుల పండుగగా ఊరేగింపు** మంగళవాయిద్యాలు, భజన కీర్తనల మధ్య స్వామివారి విగ్రహ ఊరేగింపు గ్రామంలో



అట్టహాసంగా సాగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పొలిమేర నుండి ఆలయ ప్రాంగణం వరకు సాగిన ఈ శోభాయాత్రలో యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మరియు ఊరేగింపు అనంతరం భక్తులకు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు మరియు కమిటీ సభ్యులు స్వయంగా పర్యవేక్షించి భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భోజన వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు చుట్టుపక్కల గ్రామాల భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 1,50,000 ల ఓం అక్షరాలతో శివ లింగాలతో శివుని రూపం వెలుగోడు వాసి కళ్యాణ్.




వెలుగోడు ఫిబ్రవరి 13 నంది పత్రిక: వెలుగోడు పట్టణంకు చెందిన చిత్రకారుడు కళ్యాణ్ (32) మహాశివరాత్రి పురస్కరించుకొని అద్భుత చిత్రాన్ని గీశారు. ఏ4 సైజు పేపర్ పై బ్లాక్ పెన్నుతో 150000 'ఓం' అక్షరాలు, 1500 శివలింగాలతో పరమశివుని రూపాన్ని అద్భుతంగా గీశారు. ఈ యువకుడు ఆరు గంటల పాటు శ్రమించి రూపొందించిన ఈ కళాఖండాన్ని పలువురు అభినందించారు. కళ్యాణ్ మాట్లాడుతూ నాకు చిత్రాలు గీయడమంటే ఇష్టమని , 4 తరగతి నుంచే చిత్రాలు గీయడం నేర్చుకున్నానని చెప్పారు. నేను పాలిటెక్నిక్ డిప్లొమా లో మెకానిక్ కోర్స్ చేసినట్లు చెప్పారు. వెలుగోడు నందు అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు.ఇంత వరకు సుమారు 100 చిత్రాలు గీసానని అన్నారు.రవీంద్ర నాత్ ఠాగూర్, మహాత్మా గాంధీ, సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యము , జాతీయ నాయకుల చిత్రాలు , సామాజిక రుగ్మత , హింస లకు వ్యతిరేకంగా కూడా చిత్రాలు గిశానన్నారు.పలు దేవతా చిత్రాలు గీసినట్లు చెప్పారు. ప్రభుత్వం , దాతలు సహకారం ఉంటే గొప్ప చిత్రకారునుగా ఎదగాలన్నది నా కోరిక అన్నారు.

# ప్యాపిలి బాలుర పాఠశాల ఫలితాలపై విద్యాశాఖ ఆగ్రహం

## 55% ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులకు హెచ్చరిక.. డీఈవో



నందిపత్రిక-ప్యాపిలి స్థానిక ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాలు అత్యంత నిరాశాజనకంగా ఉండటంపై విద్యాశాఖ అధికారులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మండలంలోని ఇతర పాఠశాలలతో పోలిస్తే, ఈ పాఠశాలలో కేవలం 55 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదు కావడంపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు.

**ఉపాధ్యాయులపై సీరియస్** ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నప్పటికీ, ఫలితాలు ఇంత తక్కువగా రావడంపై ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులపై పర్యవేక్షణ కరువవ్వడం వల్లే ఫలితాలు దెబ్బతిన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విద్యా సంవత్సరం ముగిసేలోపు విద్యార్థుల విద్యా ప్రమాణాల్లో మార్పు రావాలి. కఠిన చర్యలు: ఈ ఏడాది కూడా ఉత్తీర్ణత శాతం పెరగకపోతే, బాధ్యులైన ఉపాధ్యాయులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రత్యేక నిఘా:** ప్యాపిలి బాలుర పాఠశాల ఫలితాల మెరుగుదలకు సంబంధించి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. "55 శాతం ఉత్తీర్ణత అనేది ఆమోదయోగ్యం కాదు. ఉపాధ్యాయులు తమ బాధ్యతను గుర్తించి, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి. నిర్లక్ష్యం వహిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లో మహేశ్వర్ రెడ్డి, వెంకటేష్ నాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హుండీ పగిలింది

బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 13: హుండీ పగిలింది. ఏమిటా అని ముక్కున వేలు వేసుకోకండి! హుండీ పగులలేదు గురువారం రాత్రి బండి ఆత్మకూరు చౌడేశ్వరి ఆలయంలో తాళాలు వేసిన హుండీ ని శివ భక్తుల సమక్షంలో పగులగొట్టారు. ఈ సంఘటన గురించి పరిశీలిస్తే. బండి ఆత్మకూరు లోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయ నిర్వహణ విషయంలో కమిటీ నిర్వాహకులు ఆలయ పూజారిల మధ్య గత కొద్ది నెలల కాలం నుండి మనస్పర్ధలు ఏర్పడ్డాయి. చాలా కాలం నుండి ఆలయ నిర్వహణ విషయంలో ఎవరూ పూనుకోవడం లేదని గుడి పూజారి చౌడయ్య గతంలో పలుమార్లు ఆరోపించడం జరిగింది. ధూప దీప నైవేద్యాలకు ఎలాంటి సొమ్ము ఇవ్వడం లేదని, 7 నెలల కాలం నుండి తనకు జీతాలు ఇవ్వడం లేదని, కూడా ఆరోపించడం జరిగింది దేవాలయ విషయంలో గుడి పూజారి పెత్తనం చెలాయిస్తున్నాడని విమర్శలు రావడంతో జీతాలు తీసుకునేందుకు పూజారి నిరాకరించారు.ఈ నేపథ్యంలో ఆలయంలో భక్తుల సమర్పించే కానుకలు ఉండి విషయంలో కూడా వివాదం చెలరేగింది.కమిటీ నిర్వాహకులు ఒకరు ఉండికి మూడు తాళాలు వేయడంతో పూజారి చౌడయ్య కూడా మరో మూడు తాళాలు వేయడం గుండి విషయం అప్పట్లో చర్చకు దారి తీసింది. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను పూజారి చౌడయ్య గత ఏడాది డిసెంబర్ 27 వేల రూపాయల ఆదాయం వచ్చింది. అయితే హుండి విషయం మాత్రం ఎలాంటి కొలిక్కి రాలేదు. హుండి సమస్య పోలీసుల దృష్టికి వెళ్లడంతో సమస్యను పలువురు పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోమని యేసయ్య జగన్మోహన్ గతంలో సూచించడం జరిగింది . ఈ విషయంపై కమిటీ నిర్వాహకుల నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో గురువారం రాత్రి శివ భక్తుల సమక్షంలో ఉండి ని పగలగొట్టారు. హుండీలో దాదాపు 9వేల 506 రూపాయలు ఉన్నట్లుగా లెక్క తేలింది.ప్రస్తుతం గుడి నిర్వహణ ఏమిటన్నది ప్రశ్నార్ధకంగా మారిందని పలువురు చర్చించుకుంటూ ఉండటం చర్చనీయాంశంగా మారింది



# శ్రీ సీతారామ స్వామి ఆలయ వార్షికోత్సవం



కొత్తపల్లి - నంది పత్రిక : మండలకేంద్రమైన కొత్తపల్లి గ్రామంలో శ్రీ సీతారామ స్వామి ఆలయంలో ప్రతిష్ట జరిగి సంవత్సర వార్షికోత్సవన్ని పల్లా పడగలయ్య అయ్యగారి కుటుంబ వారసులు వారి మనుమడ పల్లా నాగరాజ అయ్యా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమన్ని నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆంజనేయ స్వామి లక్ష్మణస్వామి పంచలోహ ఉత్సవ విగ్రహ చరప్రతిష్ట మహోత్సవము గణపతి పూజా పుణ్యాహవాచనము నవగ్రహారాధన ఆలయం నిర్వాహకులచే వార్షికోత్సవమును పురస్కరించుకొని పంచసూక్తములు నారాయణ ఉపనిషత్ చేత పంచామృత అభిషేకములు కుంకుమార్చన అగ్ని ప్రతిష్టాపనము గణపతి నవగ్రహ హోమాదులు సుదర్శన హోమము శ్రీ సీతారామ పరివార దేవతా హోమములు కూష్మాండ బలిదానము పూర్ణాహుతి స్మార్త వైఖానసగము ప్రకారముగా పురోహితుల ఆధ్వర్యంలో నిర్వహించారు

# శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు





**శివరాత్రి బందోబస్తుకు వచ్చిన అధికారులతో సమావేశం ఏర్పాటు... భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు.... మ్యాప్ ఆధారంగా బందోబస్తులో చేయవలసిన విధులపై సవివరంగా తెలియజేసిన జిల్లా ఎస్పీ.... జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్**

శ్రీశైలం ఫిబ్రవరి 13(నంది పత్రిక) నంద్యాల జిల్లాలోని మహా పుణ్యక్షేత్రం మరియు పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుచున్న నేపథ్యంలో ప్రజల (భక్తుల)భద్రత, రక్షణను దృష్టిలో ఉంచుకుని సుమారు 1782 మంది అధికారులు సిబ్బందిచే ప్రతిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి బందోబస్తుకు వచ్చిన అడిషనల్ ఎస్పీ మరియు డిఎస్పీలతో నేడు శ్రీశైలం పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ బందోబస్తును 10 సెక్టార్లుగా విభజించడం జరిగిందని ప్రతి సెక్టార్ గురించిన వివరాలను మ్యాప్ లో చూపిస్తూ చేయవలసిన విధులపై సవివరంగా తెలియజేయడం జరిగింది.

**అధికారులుసిబ్బంది వివరాలు** కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, కడప జిల్లాల నుండి సుమారు 1614 మంది సివిల్ పోలీస్ అధికారులు సిబ్బంది. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ మరియు ఆర్మ్డు రిజర్వ్ సిబ్బంది (ఈూ=) 34 మంది సిబ్బందితోపాటు 3 =ూ× లు ఉన్నారు. స్పెషల్ పార్టీలు 03 అనగా సిబ్బంది 24 మంది సిబ్బందితో పాటు =ూ× లు 03 మంది నియమించడం జరిగింది. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుండి ముగింపు వరకు నిరంతరం కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుంది.

సిబ్బంది మరియు అధికారులు భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారికి మార్గ నిర్దేశం చేయాలి.

లడ్డు కౌంటర్ల వద్ద క్యూలైన్లో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. వాహనాల రద్దీ పెరుగుతూ ఉండడం వలన ట్రాఫిక్ అధికారులు వారి సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా ఉంచకుండా పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే నిలుపుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించడం జరిగింది.





# జవహర్ నవోదయలో ఉచిత ఫుట్ బాల్ వితరణ కార్యక్రమం.




మర్రిపాడు ఫిబ్రవరి 13నంది పత్రిక : స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఫిఫా ఫుట్ బాల్ అసోసియేషన్ వారు " ఫుట్ బాల్ ఫర్ స్టూడెంట్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఫుట్బాల్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు ఎస్సై మర్రిపాడు, తిరుపతయ్య, ధనలక్ష్మి ఎంఈఓలు మర్రిపాడు మరియు నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ , వైస్ ప్రిన్సిపల్ దీప ప్రజ్వలన కార్యక్రమంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక దుత్తలూరు, వింజమూరు, మర్రిపాడు, ఆత్మకూరు పాఠశాలల నుంచి హెడ్మాస్టర్లు మరియు డ్రిల్ మాస్టర్లు హాజరయ్యారు. ఎస్సై శ్రీనివాసరావు విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని తెలియజేశారు. తిరుపతయ్య మరియు ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రిన్సిపల్ కే పార్వతి మాట్లాడుతూ ఫిఫా ఫుట్ బాల్ అసోసియేషన్ వారు ఈ కార్యక్రమానికి నవోదయ విద్యాలయాన్ని ఎంపిక చేయటం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. విద్యాలయ పిఈటిలు ప్రభుదాసు, సత్య విద్యార్థులకు ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ క్రీడలో ఎస్సై శ్రీనివాసరావు విద్యార్థులతో మమేకమై ఉత్సాహంగా ఆడారు. ముఖ్య అతిథులకు విద్యాలయ ప్రిన్సిపాల్ పాఠశాల తరపున శాలువతో ఘనంగా సత్కరించారు. విద్యాలయ స్ సీనియర్ టీచర్ రాజశేఖర్ వందన సమర్పణతో ఈ కార్యక్రమశీ ముగిసింది.

# శివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేయండి

## మాజీ ఎమ్మెల్యే కాటసానికి ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ అధికారులు



బనగానపల్లె ఫిబ్రవరి 13 నంది పత్రిక మహా శివరాత్రి సందర్భంగా శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి వార్ల కళ్యాణ,రథ,వసంతోత్సవ,తెప్పోత్సవములకు విచ్చేయాలని శు క్రవారం ఆహ్వాన పత్రికను ఆలయ కార్యనిర్వాహనాధికారి పాండురంగా రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి వారు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ నెల 14 నుంచి 18 వ తేదీ వరకు శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామివారి శివరాత్రి మహోత్సవాలు జరగనున్న విషయం విదితమే.

# ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి

## టాలెంట్ టెస్ట్ విజేతలకు నగదు బహుమతుల ప్రదానం



వెలుగోడు, ఫిబ్రవరి 13 (నంది పత్రిక): విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చు అని డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి అన్నారు.వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెలుగోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల కోసం మండల ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదాన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమం పాఠశాల హెచ్ఎం మాలిక్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట శేషఫణి , రిటైర్డ్ లెక్చరర్ గోపాలకృష్ణమూర్తి ఉన్నారు. అతిథులు మాట్లాడుతూ విద్య అందరికీ మూలమని, విద్యార్థులలోని ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. విద్యార్థులతో విలువలతో కూడిన విద్యను అభ్యసించి, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని సూచించారు. అప్పుడు మాత్రమే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు గౌరవాన్ని తీసుకువస్తారని పేర్కొన్నారు. అనంతరం ఈ టాలెంట్ టెస్ట్ లో వేల్పనూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కే పవన్ కుమార్ 72 మార్కులతో ప్రథమ స్థానం సాధించి ఆ విద్యార్థికి మూడు వేల రూపాయలను లాయర్ కె. లక్ష్మీనారాయణ , వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం జైద్ ఖాన్ 68 మార్కులతో ద్వితీయ స్థానం సాధించి ఆ విద్యార్థికి తాళ్లూరి సంజీవని రాయుడు 2000 రూపాయలను , వేల్పనూరు పాఠశాలకు చెందిన పి పవన్ కుమార్ 65 మార్కులతో తృతీయ సాధించగా ఆ విద్యార్థికి జూటూరు శ్రీనివాసులు 1000 రూపాయల నగదు బహుమతులను అందించారు. అందించారు. ఉర్దూ మీడియంలో వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తహసీమ్ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి వెలుగోడు పట్టణ గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ ముబీన 3000 రూపాయలను, ఇదే పాఠశాలకు చెందిన షేక్ నూరుల్లా ద్వితీయ స్థానం సాధించగా కే మజార్ అలీ ఖాన్ 200 రూపాయలను, హెచ్ ఎం డి ఉమర్ ఫారూఖ్ తృతీయ స్థానం సాధించడానికి ఆ విద్యార్థికి జే. సుల్తాన్ మొహిద్దీన్ 1000 రూపాయల నగదు బహుమతులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు మండ్ల చంద్రశేఖర రెడ్డి , రిటైర్డ్ ప్రిన్సిపాల్ యాదాటి రవీంద్రుడు , డబ్ల్యూ చంద్రశేఖర్ రెడ్డి , బాలచంద్రగుప్త , ఉపాధ్యాయులు సయ్యద్ మొయినుద్దీన్ , రవిశంకర్ శర్మ , రామకృష్ణ , ఎం.ఎం.డి ఫైజుల్లా తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ కోర్టులో ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు..



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 13 నంది పత్రిక ఆళ్లగడ్డ కోర్టులో రాష్ట్ర న్యాయవాదుల సంఘం ఎన్నికలు శు క్రవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ 163 మంది న్యాయవాదులు ఉండగా 149 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరిగిందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాంరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో ఇదేవిధంగా ఎన్నికలు నేడు నిర్వహించడం జరిగిందని ప్రాధాన్యత క్రమంలో ప్రాధాన్యత క్రమంలో 23 మందిని ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల నుండి బ్యాలెట్ బాక్సులు డిటిడిసి కొరియర్ ద్వారా తరలించి వారం రోజుల అనంతరం కౌంటింగ్ చేసి ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని ఆయన వివరించారు. సీనియర్ న్యాయవాది బివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మందికి పైగా న్యాయవాదులు నేడు తమ ఓటు హక్కును వినియోగించడం జరిగిందని వివరించారు. మీడియా సమావేశంలో ఎన్నికల పోలింగ్ అధికారి శివరాంరెడ్డి, షాహినా బేగం, సుబ్బయ్య, బాల గురురెడ్డి, అమర్నాథ్ రెడ్డి, గణేష్, బాబా ఫక్రుద్దీన్, సుదర్శన్ రెడ్డి, జయ చంద్రారెడ్డి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి దాతలు చేయూత ఇవ్వండి.







**వైఎస్సార్ నగర్ లో రూపుదిద్దుకుంటున్న అయ్యప్ప స్వామి దేవాలయం. దేవాలయం నిర్మాణం పూర్తికి దాతలు సహకరించండి.**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 13 (నంది పత్రిక ) కేరళ రాష్ట్రంలో శ్రీ అయ్యప్ప దేవాలయం ప్రసిద్ధి చెందింది.ప్రతి ఏడాది అన్ని రాష్ట్రాల్లో అయ్యప్ప మాల ధరించి కేరళ లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో దీక్ష విరమిస్తారు. ఈ నేపథ్యం లోనే 41 రోజులు నిష్టగా అయ్యప్ప మాల ధరించిన వారు సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్యం పూజలు చేస్తారు. అయ్యప్ప స్వాములు ప్రతి ఏడాది పెరిగిపోవడంతో అయ్యప్ప దేవాలయాలు నిర్మిస్తున్నారు. దాతల సహకారంతో వివిధ ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి దేవాలయాలు వెలుస్తు న్నాయి. ఈ నేపథ్యంలోనే నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్ రోజు రోజుకు విస్తరిస్తుంది. అధికంగా పేదవారు అధికసంఖ్యలో దాదాపు 10 వేల మంది అక్కడ నివసిస్తున్నారు. అయ్యప్ప మాల ధరించిన వారు పట్టణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం కు వెళ్ళాలంటే దూరాభారం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ నగర్ కు చెందిన గురుస్వామి టీవీ. రమణ గారు దాదాపు 28 సార్లు అయ్యప్ప మాల ధరించారు,తండ్రి అడుగుజాడల్లో కుమారుడు సోమశేఖర్ సైతం 14 సార్లు మాల ధరించారు. ఆ ప్రాంతంలో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మిస్తే మాలదరించిన భక్తులందరికీ మరియు ప్రజలకి వెసలుబాటు ఉంటుందని ఆలోచించారు. స్థలం,నిర్మాణానికి డబ్బు అధికంగా అవు తుందని అప్పటి హౌసింగ్ మినిస్టర్ శిల్పా మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొనిపోయారు. ప్రభుత్వం రామాలయం,అయ్యప్ప దేవా లయం,కళ్యాణ మండపానికి 52 సెంట్ల స్థలము కేటా యించింది. ఈ నేపథ్యంలోనే అయ్యప్ప స్వామి దేవాలయం ఏర్పాటు చేయాలని కొందరు పెద్దలు ముందుకు వచ్చి దాతల సహకారంతో దాదాపు కోటి 30 లక్షలతో నిర్మాణం చేపట్టారు. దేవాలయంలో శివాలయం, విఘ్నేశ్వరుడు, అయ్యప్ప స్వామి,సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వెంకటేశ్వర స్వామి,మాలికా పురుషోత్తమ స్వామి విగ్రహాలను అక్కడే ప్రతిష్టచేయడానికి పనులు మొదలు పెట్టారు. గతంలో అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమల వెళ్లిన సమయంలో స్వామి వారిని దర్శించుకొని అలాంటి దేవాలయం వైఎస్సార్ నగర్ ఏర్పాటు చేయడానికి అప్పుడే బీజం పడింది. నటి నుంచి నేటి వరకు ఎందరో దాతలు సహాయ సహకారాలు అందించడంతో దాదాపు 80 శాతం దేవాలయం నిర్మాణం పూర్తి అయింది. ఇంకా దేవాలయం పూర్తి కావడానికి దాదాపు 30 లక్షలు అవసరం ఉందని పెద్దలు పేర్కొంటు న్నారు . దేవాలయం నిర్మాణం పూర్తి కావడానికి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు ఎవరైనా విరాళాలు ఇవ్వా లను కుంటే ఈ నంబర్ కు ఫోన్ పే చేయాలని 8328 335850 కోరారు. దాతలు ఎవరైనా, ఎప్పుడైనా వైఎస్సార్ నగర్ లో నిర్మాణంలో ఉన్న దేవాలయం ను సందర్శించి సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు.



# హంగ్ మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్ అప్పడే బేరసారాలు మొదలు

తెలంగాణ వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు,116 మున్సిపాలిటీ లకు బుధవారం ఎన్నికలు జరుగగా.. శుక్రవరాంఓట్ల లెక్కింపు పక్రియ కొనసాగుతోంది. మొత్తం 136 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతోంది. మధ్యాహ్నం 3 గంటల వరకు వెల్లడి అయిన ఫలితాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ 90కి పైగా మున్సిపాలిటీల్లో, బీఆర్ఎస్ 24 మున్సిపాలిటీల్లో విజయాలు సాధించాయి. అయితే పలు చోట్ల అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య గట్టిపోటీ నడుస్తోంది. ఏ పార్టీ మ్యాజిక్ ఫిగర్ అందుకోక కొన్నిచోట్ల హంగ్ ఏర్పడింది. దాంతో ఆయా మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్‌కు తెరలేచింది. మ్యాజిక్ ఫిగర్ కోసం అప్పుడే బేరసారాలు మొదలయ్యాయి. చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో స్వతంత్రులు, ఎక్స్ అఫిషియో సభ్యులు కీలకం కానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు మొత్తం 16 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. ప్రజలు హంగ్ తీర్పు ఇచ్చిన మున్సిపాలిటీల్లో పరకాల, అలంపూర్, నర్సాపూర్, జిన్నారం, కేసముద్రం, ఇస్నాపూర్, ఆసిఫాబాద్, జమ్మికుంట, జనగామ, కామారెడ్డి, అమరచింత, కోహీర్, దేవరకద్ర, ఆసిఫాబాద్, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, మహబూబాబాద్, ఆలియాబాద్, బోధన్, గద్వాల, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీ తన ఖాతాలో 24 మున్సిపాలిటీలు వేసుకుంది. సంగారెడ్డి జిల్లాలోని గడ్డపోతారం, ఇంద్రేశం, గుమ్మడిదల.. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ, మహబూబాద్ జిల్లాలోని తొర్రూరు, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ నేరేడు చర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, అశ్వారావుపేట, స్టేషన్ ఘన్‌పూర్, ఆందోలు-జోగిపేట, సదాశివపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర మున్సిపాలిటీల్లో గెలిచింది. కాగా అనూహ్య రీతిలో వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఇక ఇతర పార్టీలు ఏ మున్సిపాలిటీలోనూ అధికారానికి దరిదాపుల్లో లేవు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు గానుబీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 8, బీజేపీ 4 స్థానాలను దక్కించుకుంది. బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు విస్తృత ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు అవిరాళంగా కృషి చేశారు.

నంది పత్రిక

శనివారం 14 - 02 -2026

# వివిధ శాఖలు టాక్స్ లు ద్వారా రావలసిన బాకాయిలను ఖజానాకు జమచేయించి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.



## ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలను సాధించాలి. జిల్లా కమర్షియల్ టాక్స్ కో-ఆర్డినేషన్ (రెవిన్యూ వచ్చే శాఖలు) సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం ...

**ఏలూరు, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13: నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కమర్షియల్ టాక్స్ కో-ఆర్డినేషన్ ( రెవిన్యూ వచ్చే శాఖలు) జిల్లా కలెక్టరు అధ్యక్షతన కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెవిన్యూ వచ్చే శాఖలు వారీగా సమీక్షించి, నిర్ణీత గడువులోగా రావలసిన బకాయిలను ప్రభుత్వ ఖజానాకు జమ చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కమర్షియల్ టాక్స్, జిల్లా సివిల్ సప్లై, మైన్స్, పోలీసు శాఖలతో జాయింటు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి, రెవిన్యూ వసూళ్లలో ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ పురోగతిని సాధించాలన్నారు. ప్రతి నెల రెండవ వారంలో జిల్లా కలెక్టరేటులో ఒక సమావేశాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, రెవిన్యూ వసూళ్ల ప్రగతిని, వచ్చే నెలలో రెవిన్యూ వసూళ్లపై ఈ సందేశంలో శాఖలు వారీగా చర్చిస్తామని తెలిపారు. అలాగే మండల స్థాయిలో కూడా సమావేశం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో జీఎస్టీ ఏరియర్సు 249 కేసులు ద్వారా రూ 24 కోట్లు రావాల్సిఉందని శాఖలు వారీగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రెవిన్యూ రికవరికీ కావలసిన సహకారం పూర్తిస్థాయిలో సమకూర్చుకుని, మంచి ప్రగతిని సాధించాలన్నారు. సరుకులు ఎగుమతులు అయ్యి రవాణా అవుతున్న వాహనాలకు వే బిల్లులు, బిల్లులు, చెక్ చెయ్యాలని, సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాట్లు చేసి సమర్థవంతంగా తనిఖీలు చెయ్యాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు, ఆర్&ఆర్ ప్యాకేజీ భారీ, చిన్నతరహా పనులకు కాంట్రాక్టరుకు చెల్లించిన సొమ్ములు జమ అయినది వెరిఫై చేసి, వీటిద్వారా రావలసిన టాక్స్ జమ అయిందా పరిశీలన చెయ్యాలని అన్నారు. ఏపీ డబ్ల్యు ఐడిసి, ఆర్ &బి, పంచాయతీరాజ్,గృహనిర్మాణ శాఖలుతో ఒక కమిటీ ఏర్పడి ఎప్పటికప్పుడు వెరిఫై చేసి పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఆదేశించామన్నారు. కమర్షియల్ టాక్స్ విభాగానికి, రెవిన్యూ వచ్చే శాఖలకు సంబంధించిన పన్ను వసూళ్ల పురోగతి, బకాయిలు వసూళ్లు, జీఎస్టీ అమలు, ఈ-వే బిల్ తనిఖీలు, అక్రమ రవాణా నియంత్రణ చర్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించామని తెలిపారు. ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని, లక్ష్యాలను అధిగమించాలని సూచించామని తెలిపారు. పన్ను ఎగవేతలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు, వ్యాపార వర్గాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయం పెంపు లక్ష్యంగా అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని పేర్కొన్నారు. వివిధ శాఖలు పరిధిలో పెండింగులో ఉన్న పన్నులు, ఫీజులు, లీజులు మరియు ఇతర బకాయిలు వివరాలను సమగ్రంగా పరిశీలించి, వసూళ్ల ప్రక్రియను వేగవంతం చెయ్యాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆదాయం పెంచేందుకు అనుసరించ వలసిన మార్గాలుపై సమీక్షించడం జరిగిందని అన్నారు. ఖనిజాలు, ఇసుక, భూములు లీజులు, వాణిజ్య పన్నులు, స్టాంపు డ్యూటీలు వంటి వనరులు ద్వారా ఆదాయం పెంపు సాధ్యమని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు వినియోగాన్ని మెరుగు పరచడం, లీజులు పారదర్శకంగా నిర్వహించడం, డిజిటల్ పద్ధతుల్లో వసూళ్లు చేయడం ద్వారా ఆదాయం పెంపు సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి తమ శాఖకు సంబంధించిన వసూళ్ల లక్ష్యాలను నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తి చెయ్యాలని స్పష్టంచేసినట్లు తెలిపారు. నెలవారీ సమీక్ష సమావేశాలు నిర్వహించి పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ నక్కా సూర్య చంద్రరావు, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, కమర్షియల్ టాక్స్ జాయింటు కమీషనరు బి.నాగార్జున రావు, ఆర్&బి శాఖ యస్ఇ కె.విజయరత్నం, జడ్పీ సిఇవో యం.శ్రీహరి, జిల్లా ఆర్ డబ్ల్యు యస్ అధికారి జి.త్రినాథ బాబు, సివిల్ సప్లై జిల్లా మేనేజరు పి.శివరామ మూర్తి, జిల్లా డియస్ వో ఇ.బి. విలియమ్స్, మైన్స్ డిడి జి.పాపారావు, జిల్లా పరిశ్రమలు కేంద్రం జియం ఆర్.వెంకటరావు, లీగల్ మెట్రాలజీ సహాయ కంట్రోలరు కె.యస్.రాజు, కమర్షియల్ టాక్స్ అధికారులు, సంబంధిత శాఖలు అధికారులు పాల్గొన్నారు.



# పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి నూతన పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి.

## పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగు యూనిట్లు స్థాపనకు నిర్ణీత సమయంలోనే అన్ని అనుమతులు జారీ చెయ్యాలి. నూతన పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, బ్యాంకు రుణాలు మంజూరుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి మరియు ఇన్వెస్టర్లతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలలో అభివృద్ధి సంతృప్తికరంగానే ఉన్న, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకు అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, నూతన పరిశ్రమల స్థాపనకు అనుమతులు, బ్యాంకు రుణాలు మంజూరు, మౌలిక వసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ భూములు అందుబాటులో లేవని సాధ్యమైనంత వరకు నూతన పారిశ్రామికవేత్తలు సంబంధిత భూ యజమానుల భాగస్వామ్యంతో పరిశ్రమ ఏర్పాటుకు ఆలోచన చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ రంగాలకు సంబంధించిన ఇన్వెస్టర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పరిశ్రమల వివరాలు, కొత్తగా ప్రారంభించబోయే పరిశ్రమలు, వ్యాపారాలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉండి గ్రామానికి చెందిన అశోక్ డిహైడ్రేషన్ ఆఫ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ ప్రాసెసింగ్ యూనిట్ గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు. భీమవరానికి చెందిన యువ పారిశ్రామికవేత్త కె.టి ఎన్ సత్యనారాయణ బయో డీగ్రేడబుల్ ప్రొడక్ట్స్ హస్క్ నుండి పేపర్ ప్లేట్లు సింగల్ యూజ్డ్, రీ యూజబుల్ ఉత్పత్తులపై వివరించారు. రైస్ మిల్లింగ్ ద్వారా వచ్చే పొట్టు నుండి సిలికాన్ ఉత్పత్తిపై భీమవరానికి చెందిన కృష్ణ తమ ప్రాజెక్టు గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్వెస్టర్స్ తో మాట్లాడుతూ ముడి సరుకు లభ్యత, టెక్నాలజీ వినియోగం, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం రైస్ మిల్లులు ఎక్కువ విస్తీర్ణంలో నిర్వహించబడుతున్నాయని, ఖాళీగా ఉన్న భూమిని వినియోగించుకొని రైస్ ఆధారిత ఉప ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకు ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఎన్ ఆర్ డి సి ఆధ్వర్యంలో వివిధ రంగాలలో యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు టెక్నాలజీ, మిషనరీ, ముడి సరుకు లభ్యత, మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, వివిధ అనుమతులు పై అవగాహన కల్పించేందుకు మార్చి నెలలో వర్క్ షాప్ నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉండి, ఆకివీడులలో ఉన్న పార్కులకు అనుబంధంగా ఉన్న చెరువుల నందు పిల్లలను, పెద్దలను ఆకర్షించే విధంగా బోటింగ్ సదుపాయాన్ని కల్పించాలని జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో పరిశ్రమల శాఖ ప్రగతి పై సమీక్షిస్తూ డిసెంబర్ 24వ తేదీ నుండి ఇప్పటివరకు వివిధ శాఖల అనుమతుల కోసం 1,335 ధరఖాస్తులు రాగా 1,338 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, మరో 16 ధరఖాస్తులు పరిష్కరించవలసి ఉందన్నారు. పిఎంఈజీపి పథకం 2025-26 కింద యూనిట్ల స్థాపన మంజూరు కొరకు 333 దరఖాస్తులను బ్యాంకులకు పంపడం జరిగిందని, 318 యూనిట్లు స్థాపించడం జరిగిందని, బ్యాంకుల వద్ద పెండింగ్ లో 164 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏవి అప్పారావు, ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ స్వాతి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, చేనేత శాఖ అధికారి కె.అప్పారావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.అరుణ కుమారి, జిల్లా రవాణా శాఖ అధికారి కె.కృష్ణారావు, యూనియన్ బ్యాంక్ ప్రతినిధి పి.ప్రేమ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇన్వెస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సాగునీటి పారుదలకు ఇబ్బంది లేని విధంగా అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచెయ్యాలి





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో చేపట్టిన, చేపట్టవలసిన వివిధ సాగునీటి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గత సమావేశంలో శాసనసభ్యులు ప్రస్తావించిన సాగునీటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు మంజూరు కానీ పనులకు వెంటనే ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. సాగునీటి డ్రెయిన్ లు, షట్టర్లు, కాలవగట్లు దెబ్బతినే అవకాశం ఉన్న పనులను ముందుగానే గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేసి, మంజూరు అయిన వెంటనే పూర్తి చేయాలన్నారు. పనులు మంజూరులో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకురావాలని సూచించారు. కాలవలు కట్టివేకముందే టెండర్లను ముగించి కాలవలు నిలుపుదల చేసిన వెంటనే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. తూడు తొలగింపు పనులు మంజూరైన కాలువలు, డ్రెయిన్ లలో కంటికి కనిపించేంత స్పష్టంగా తొలగింపు పనులను చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మొగల్తూరు మండలంలో ఎక్కువ తూడు తొలగింపు పనులు మంజూరయ్యాయని, ఎక్కడ ఫిర్యాదు రాని విధంగా త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరకు నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉండవచ్చని సూచనప్రాయంగా తెలియజేశారు. పశ్చిమ డెల్టా కింద 11 ప్రధాన కాలువలు 352.62 కిలోమీటర్ల విస్తరించి ఉన్నాయన్నారు. బ్రాంచ్ కెనాల్సు 1,044.57, మేజర్ & మైనర్ కెనాల్స్ 824.11 కిలోమీటర్లు మొత్తం 2,221 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఓ అండ్ ఎమ్ పనులకు రూ.1273.65 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. 152 తూడు తొలగింపు, 74 పూడిక తీత, 24 షట్టర్లు మరమ్మత్తులు, 41 టేప్ గ్రాస్ తొలగింపు, 42 ఇతర పనులు ఉన్నాయన్నారు. అలాగే డ్రెయిన్స్ లో తూడు తొలగింపు, ఇతరత్రా పనుల నిమిత్తం మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించి సకాలంలో పనులను పూర్తి చేయాలన్నారు. దర్భ రేవు పూడికతీత పనులకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కెనాల్స్ ఇఇ యు.రమేష్, డ్రెయిన్లు ఇఇ సీహెచ్ సత్యనారాయణ, డీఇలు పి ఎన్ వి ఎస్ ఎస్ మూర్తి, కే ధర్మజ్యోతి, ఏ వెంకటలక్ష్మి, కే శ్రీనివాస్, జి వినోద్ చంద్, వెంకటనారాయణ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



# సిఐఐ రిజిస్ట్రేషన్లకు ఎన్ఓసి సంబంధిత ఆర్డీవో కార్యాలయాల ద్వారానే పొందాలి


## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక** సిఎఎ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా అవసరమైన ఎన్ఓసి (చీశీ ూఎఎఎవవ్షిఱశీఅ జవతీఱఏటఱఛ్ఞవ)లను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల ద్వారా మాత్రమే పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. సిఎఎ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇనామ్, జమీందారి భూములు అలాగే మొగల్తూరు మండలం, నర్సాపురం , యలమంచిలి, భీమవరం మండలాల్లో వెబ్ ల్యాండ్ లో డేటా లేని రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను మత్స్యశాఖ అధికారులు సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. ఆ వివరాల ఆధారంగా సంబంధిత ఆర్డీవో కార్యాలయాల ద్వారా ఎన్ఓసి పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్ఓసి పొందేందుకు ఎవరూ వీఆర్వోలను సంప్రదించవలసిన అవసరం లేదని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత ఆర్డీవో కార్యాలయం లేదా మత్స్యశాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలను జారీచేశారు. అలాగే వెబ్ల్యాండ్లో డేటా నమోదైన ఆక్వా రైతులు అప్పడా (ఝూా-ాణఖూ) రిజిస్ట్రేషన్లను రెవెన్యూ శాఖతో సంబంధం లేకుండా మత్స్యశాఖ అధికారులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్ ల్యాండ్ లో డేటా నమోదుకాని రైతులు తప్పనిసరిగా సిఓసి పొందాలని, వీరికి సంబంధించిన వివరాలను మత్స్య శాఖ సిబ్బంది సేకరించి ఆర్డీవో కార్యాలయం ద్వారా సిఓసి పొందడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రక్రియలో ఆలస్యం లేకుండా రైతులకు సౌలభ్యం కల్పించేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొన్నారు.

# సిఎంఎంఎస్ వై సాగరమాల ద్వారా హార్బర్ల ఆధునీకరణ

## ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి ముత్యాలమ్మపాలెం మినీ జెట్టీపై సి ఐ సి ఈ ఎఫ్ ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయన- శాసనసభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రశ్నకు సమాధానం చెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి చీఫ్ బ్యూరో , ఫిబ్రవరి 13: నంది పత్రిక** పి ఎం ఎం ఎస్ వై (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన), సాగరమాల వంటి కేంద్ర పథకాల సహకారంతో రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో మినీ జెట్టి / ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోస్తా ప్రాంత అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల స్థితిగతులు, ముత్యాలమ్మపాలెం ప్రాజెక్ట్ పురోగతి గురించి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. దీనికి సమాధానంగా వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి 12 కోస్తా జిల్లాల్లో కలిపి 1053.07 కి.మీ తీరప్రాంతం ఉండగా, 350 ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్లు గుర్తించబడ్డాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టామని, 2020 సంవత్సరం జులై 15 నుంచి ఫిషింగ్ హార్బర్లు మత్స్యశాఖ నుంచి పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. తొలి దశలో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉండగా, రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, వోడరేవు హార్బర్లు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. పీఎంఎంఎస్వై సాగరమాల, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో విశాఖ హార్బర్ ఆధునీకరణ పనులు రూ.178.51 కోట్లతో కొనసాగుతున్నాయని, కాకినాడ హార్బర్ ఆధునీకరణకు రూ.58.95 కోట్లతో పి ఆర్ సిద్ధం చేయడానికి సీఐసీఈఎఫ్ అంగీకరించిందని వివరించారు. అలాగే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల విషయంలో అంతర్వేది పల్లిపాలెం, గుండయపాలెంలో జెట్టీ సౌకర్యాలతో కార్యకలాపాలు సాగుతున్నాయని, భావనపాడు ఎఫ్ ఎల్ సి కు నది ముఖద్వారం స్థిరీకరణ కోసం అవసరమైన సాంకేతిక చర్యలను ఏపిఎంబి కు తెలియజేశామని చెప్పారు. పి ఎం ఎం ఎస్ వై కింద రూ.126.91 కోట్లతో దొండువాక, ఉప్పలంక, భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువులో ఎఫ్ ఎల్ సి అభివృద్ధి టెండరింగ్ దశలో ఉందన్నారు. మచిలీపట్నం, బియ్యపుతిప్ప ఎఫ్ ఎల్ సి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం ప్రాంతానికి సంబంధించి ప్రజల అభ్యర్థన మేరకు సిఐసిఈఎఫ్ ద్వారా ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనాలు నిర్వహించబడినట్లు, తుది నివేదికలు అందాల్సి ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. నివేదికలు వచ్చిన వెంటనే సాంకేతిక సాధ్యత ఆధారంగా మినీ జెట్టి / ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణంపై తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కోస్తా ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు కట్టుబడి ఉందని, అవసరమైన అన్ని మౌలిక వసతులు దశలవారీగా అభివృద్ధి చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన ఈ ఆధునీకరణ కార్యక్రమాలు పూర్తయ్యాక కోస్తా ప్రాంతాల్లో మత్స్యరంగానికి కొత్త ఊపొస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఫలితాల్లో కవిత సంచలనం

## వడ్డేపల్లి మున్సిపాలిటీ జాగృతి కైవసం

## ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కింద పోటీచేసి విజయం

తెలంగాణలోని మున్సిపాలిటీ ఫలితాల్లో సంచలనం నమోదయ్యింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే చాలా మున్సిపాలిటీల ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఖాతాలో ఒక మున్సిపాలిటీ చేరింది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని కవిత పార్టీ అయిన తెలంగాణ జాగృతి పార్టీ కైవసం చేసుకుంది. తెలంగాణ జాగృతి పార్టీ అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింబల్ పై పోటీ చేసిన విషయం తెలిసిందే. జాగృతి పార్టీ నేత వాడేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ అభ్యర్థులు ఎనిమిది స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ సింబల్తో పోటీ చేసి విజయం సాధించారు. మున్సిపాలిటీలో మొత్తం 10 వార్డులు ఉండగా.. కవిత జాగృతి పార్టీ అభ్యర్థులు ఎనిమిది స్థానాల్లో, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు చెరో వార్డులో విజయం సాధించారు. జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఘన విజయం సాధించింది. ఏఐఎఫ్బీ తరఫున పోటీ చేసిన కీలక అభ్యర్థి శ్రీను గత నెల రోజుల కింద మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత వెంట ఉన్నారు. ఆమెతో కలిసి పని చేశారు. అయితే.. వడ్డేపల్లి మున్సిపాలిటీలో మొత్తం 10 వార్డులకు గానూ.. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 8 గెలుచుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ఒక్కో సీటు లభించింది.

# చిట్యాలలో ట్రాన్స్జెండర్ శ్వేత సుధాకర్ విజయం

రాష్ట్రంలో రెండు కార్పోరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఇటీవల పోలింగ్ జరిగింది. ఇవాళ కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నల్గొండ జిల్లాలోని చిట్యాల మున్సిపాలిటీలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఓ ట్రాన్స్జెండర్ విజయం సాధించారు. ట్రాన్స్జెండర్ శ్వేత సుధాకర్ చిట్యాల మున్సిపాలిటీలోని 1వ వార్డు నుంచి బరిలో దిగారు. ఎన్నికల ప్రచారంలో శ్వేత సుధాకర్ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా సుధాకర్ ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. దాంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను కాదని ఓటర్లు శ్వేత సుధాకర్ను గెలిపించుకున్నారు.

# నిబంధనల మేరకు వాణిజ్య పన్నులు చెల్లింపులు జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయి..

**ఆదాయ ఆర్జన శాఖలు పన్నులు వసూళ్లలో వాణిజ్య పన్నుల శాఖతో కలిసి సమన్వయంతో పనిచేయాలి**

**వాణిజ్య పన్నుల పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరు సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా ప్రజలకు మరింత సంక్షేమం అందించడానికి దోహదపడుతుంది**

**వాణిజ్య పనులు, గనులు & భూగర్భ శాఖ, పౌర సరఫరాలు, పోలీసు శాఖలతో జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు ఆదేశాలు**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13, నంది పత్రిక జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జీఎస్టీ సమన్వయ సమావేశాన్ని వాణిజ్య పన్నులు, ఆదాయ ఆర్జన శాఖలు అయిన రెవిన్యూ, మైన్స్ అండ్ జియాలజీ, రవాణా, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, విద్యా, ఇరిగేషన్, హౌసింగ్, ఇండస్ట్రీస్, తదితర శాఖలతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వివిధ రంగాల నుండి అందే ఆదాయంతో పాటు నిబంధనల మేరకు వాణిజ్య పన్నులు చెల్లింపులు ద్వారా అందే ఆదాయం జిల్లా, రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ వాణిజ్య పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు. వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేస్తున్న పనులకు ఆయా ఏజెన్సీలు ఎంత మేరకు అని చెప్పను చెల్లిస్తున్నాయో సంబంధిత అధికారులు పరిశీలించిన మీదటే బిల్లులు చెల్లింపులు ఉండాలన్నారు. కొన్ని సందర్భాల్లో బిల్లులు ఆలస్యంగా చెల్లింపులు చేయడం జరుగుతుందని బిల్లులు జారీ సమయంలో ఆ విషయాన్ని కూడా గమనించాలి అన్నారు. ఎన్.హెచ్, రైల్వే స్, ఇరిగేషన్, డిలైట్ కంపెనీ పనులకు సంబంధించి ఆయా ఏజెన్సీలు చెల్లింపులను పరిశీలించాలన్నారు. ఏఏ అంశాలలో పన్నులు వసూలు చేయాల్సి ఉంటుందో మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బందికి ఆన్లైన్ శిక్షణను అందించాలని వాణిజ్య పన్నుల అధికారులకు సూచించారు. జిల్లాలో 14,807 రిజిస్ట్రేషన్స్ ఉన్నాయని, వారిలో 11,063 మంది క్రమం తప్పకుండా పన్నులను చెల్లించడం ద్వారా 74.65 లక్ష్యసాధన జరిగిందన్నారు. 3,754 మంది కాంపోజిషన్ టాక్స్ చెల్లింపులు 26.35 శాతంగా ఉందన్నారు. జిల్లాలో 273 టాక్స్ పేయర్స్ ద్వారా సుమారు రూ.25.65 కోట్లు బకాయిలు ఉన్నాయని వాణిజ్య పన్నుల అధికారులు తెలిపారు. ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించవలసిన పదిమంది వివరాలను అందచేయాలని కలెక్టర్ సూచించారు.



ప్రైవేటు విద్యాసంస్థలు, పాఠశాలలు, కళాశాలలు పన్నుల చెల్లింపును పరిశీలించి నివేదికను అందజేయాలని డీఈఓ ఆదేశించారు. బకాయిపడిన డిఫాల్టర్ల ఆస్తుల గుర్తింపు, జప్తుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. లైసెన్సులు, పునరుద్ధరణలను జారీ చేసేటప్పుడు పన్నులు చెల్లింపులను పరిశీలించాలన్నారు. కాంట్రాక్టర్లు స్థానికంగా పెట్రోల్ అండ్ ఆయిల్స్ కొనుగోలు చేసేలా చూసుకోవాలని, తద్వారా వ్యాట్ కోల్పోకుండా అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు, డిప్యూటీ కమిషనర్ కెపి శైలజ శ్రీ, పాలకొల్లు, భీమవరం అసిస్టెంట్ కమిషనర్ డి.సాంబశివరావు, తణుకు, తాడేపల్లిగూడెం అసిస్టెంట్ కమిషనర్ కె.వి శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డిపిఓ ఎన్.రామ్నాథ్ రెడ్డి, డీఈవో ఇ.నారాయణ, ఆర్డబ్ల్యూఎస్ శ్రీనివాసరావు, డీఎస్ఓ సరోజ, సివిల్ సప్లైస్ డి.ఎం ఎండి ఇబ్రహీం, గృహ నిర్మాణ శాఖ జి.పిచ్చయ్య, డిఎంహెచ్వో జి.గీతా బాయి, మున్సిపల్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. .

## స్వమిత్వ సర్వే ప్రక్రియను వేగవంతంచేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 13 నంది పత్రిక. జిల్లాలో ఫేజ్– 2 స్వమిత్వ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, స్వమిత్వ ప్రోగ్రెస్ పై జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయితీ కార్యదర్శులు, స్వమిత్వ కేటాయించిన సర్వేయరులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఫేజ్– 2 స్వమిత్వ సర్వే జరుగుచున్న 197 గ్రామాలుగాను చివరి దశకు చేరుకున్న 54 గ్రామాలు సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా గ్రౌండ్ ట్రూత్ నింగ్ గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. భూ యజమానుల హక్కులను స్పష్టంగా నమోదు చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. ఇప్పటికే పూర్తయిన గ్రామాలు వివరాలు పెండింగ్ లో ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యం ఆలస్యము ఉండకూడదని అన్నారు. ముందుగా స్వమిత్వ గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామసభలలో ప్రజల వద్ద నుండి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి పరిష్కరించాలన్నారు. ఆయా గ్రామాలలో తుదిదశకు తీసుకువచ్చినవి గెజిట్ నోటిఫికేషన్ రిపోర్టును, అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామ్ నాథ్ రెడ్డి, జిల్లాలోని అందరూ డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, స్వమిత్వ కేటాయించిన సర్వేయర్లు పాల్గొన్నారు.

## శారీరిక అవరోధాలు ఉన్నప్పటికీ ధైర్యంతో ముందుకు సాగాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా పోడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విభిన్న ప్రతిభావంతురాలు గోడి లక్ష్మి ప్రసన్న కు క్రచేస్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఏ విషయంలోనూ తక్కువ కాదని శారీరక అవరోధాలు ఉన్నప్పటికీ ధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. అవసరమైన సహాయక పరికరాలు, పెన్షన్లు, వైద్య సహాయం వంటి సేవలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఉన్నత చదువులు చదువుకుని ఆదర్శంగా నిలవాలని విద్యార్థి గోడి లక్ష్మీ ప్రసన్నను జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. తమ సమస్యను గుర్తించి వెంటనే ప్రభుత్వం ద్వారా క్రచేస్ అందజేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కి మరియు విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులకు లక్ష్మీప్రసన్న, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## రానున్న వేసవిలో పట్టణ ప్రాంతాల్లో ఎటువంటి త్రాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.



**రానున్న ఉగాదికి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందించేందుకు గృహ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు వేగవంతంగా పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తో కలిసి జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో ప్రజలకు త్రాగునీటి సరఫరా, టిడ్కో గృహాలు నిర్మాణ ప్రగతి, ప్రాపర్టీ టాక్స్, వాటర్ టాక్స్, శానిటేషన్, డ్రైనేజీల నిర్వహణ తదితర అంశాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్స్, శానిటరీ ఇన్స్పెక్టర్ లతో మున్సిపాలిటీ వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో పట్టణాలలో ఎటువంటి త్రాగునీరు కొరత లేకుండా ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు మున్సిపల్ కమిషనర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే త్రాగునీరును ప్రతిరోజు పరీక్షలు నిర్వహించాలన్నారు. పైప్ లైన్ ల ద్వారా త్రాగునీరు లీకేజీ లేకుండా ముందుగానే లీకేజీలను అరికట్టే చర్యలు తీసుకోవాలన్నారు. త్రాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ శివారు ప్రాంతాలకు త్రాగునీరు సరఫరాచేసే వాటర్ ట్యాంకులు ప్రతిరోజు క్లీన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పురమిత్ర యాప్ ద్వారా లభించే సేవలపై ప్రజలకు తెలిసే విధంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణాల్లో హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, రహదారి మరమ్మత్తులపై దృష్టి



పెట్టాలన్నారు. దోమల నివారణకు సక్రమంగా ఫాగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్వచ్ఛత నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థల మెరుగుదల కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజా ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సిహెచ్ నాగ నరసింహారావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్లకు ఘనంగా అభినందన సభ



వెలుగోడు, ఫిబ్రవరి 13 (నంది పత్రిక): వెలుగోడు పట్టణంలోని ప్రభుత్వ సామూహిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లకు శుక్రవారం అభినందన కార్యక్రమం జరిగింది. పీడియాట్రిషియన్ డా. సులోచన, అనస్థీషియా చెందిన డా. అమూల్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా. ఇక్రామ్ అలీ ఖాన్ విశాఖపట్నంలో డీసీఎస్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా, అలాగే డా. ప్రదీప్ తిరుపతిలో పీజీ జనరల్ మెడిసిన్‌కు ఎంపికైన సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఘనంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్లు, సిబ్బంది డా. ఇక్రామ్ అలీ ఖాన్ సేవలు ఆసుపత్రికి ఎంతో కీలకమని చెప్పారు. స్థానిక ప్రజలకు అంకితభావంతో సేవలందించిన డాక్టర్‌గా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. చివరగా డాక్టర్ల భవిష్యత్ ప్రస్థానం మరింత విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

## 18 న నంద్యాల పర్యటనకు వైయస్ షర్మిల... బనగానపల్లె కాంగ్రెస్ ఇంచార్జి బాలు యాదవ్




బనగానపల్లె ఫిబ్రవరి 13నందిపత్రిక ఫిబ్రవరి 18న ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి బస్సు యాత్రలో నంద్యాల పర్యటనకు వస్తున్నారని బనగానపల్లె కాంగ్రెస్ ఇంచార్జి బాలు యాదవ్ తెలిపారు. శుక్రవారం బాలు యాదవ్ మాట్లాడుతూ ఆనాడు పేదల ఆకలి తీర్చేందుకు పనికి ఆహార పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామి పథకాన్ని తీసుకవచ్చి పేదలకు పనులు లేనికాలంలో ఉపాధి చూపించేందుకు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అయితే నేటి కేంద్ర ప్రభుత్వం పథకాన్ని తొలగిస్తూ తీసుకువచ్చిన నూతన స్కీమ్ కు వ్యతిరేకంగా మా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వై ఎస్ షర్మిలా రెడ్డి పేద ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు యాత్ర చేపట్టారని కాబట్టి ప్రతి కాంగ్రెస్ నాయకుడు అభిమానులు ఆమె పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పర్యటన నంద్యాల నుండి కానాల, గోసుపాడు, సిరివెళ్ల మీదుగా ఉంటుందని తెలిపారు.

## చదువు కున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు విరాళం

బనగానపల్లె ఫిబ్రవరి 13నందిపత్రిక మండల పరిధిలోని నందివర్గం ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి వరకు చదువుకున్న జమ్మలమడుగు పట్టణానికి చెందిన వద్ది జయరామయ్య కుమారుడు డాక్టర్ వద్ది మురళీకృష్ణ వారి ధర్మపత్ని డాక్టర్ భారతి శుక్రవారం చదువుకున్న పాఠశాలకు తనవంతు సాయంగా 50000(యాభైవేల రూపాయలు) విలువచేసే భోజనపు ప్లేట్స్ పాఠశాల విద్యార్థుల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట కొండయ్య కి అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్జనకు పేదరికం అడ్డుకాదని శ్రద్ధ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు అలాగే డాక్టర్ భారతి బాలికల ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన నియమాలు తెలియజేశారు తదుపరి పిల్లలకు పాయసం అందజేసారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట కొండయ్య మరియు నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కుమార్ బాబు మరియు పాఠశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు



## 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ

జూపాడుబంగ్లా: ఫిబ్రవరి: 13 :(నంది పత్రిక) ప్రైవేట్ పాఠశాలలో ఒకటవ తరగతి లో 25% ఉచిత అడ్మిషన్లు ప్రభుత్వం కల్పించిందని ఎంఈఓ చిన్న మద్దిలేటి శుక్రవారంతెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం ఉచిత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. విద్య హక్కు చట్టం 2009 ప్రకారం పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25% సీట్లను ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలలో ఒకటవ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. ఫిబ్రవరి 20 తేదీ నుండి మార్చి 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్ కార్డు ద్వారా ప్రాథమిక వివరాలుతో సైట్ ఉన్నందు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.




## ఆంగ్లేయులను ఎదిరించిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి : బిసి రాజారెడ్డి

**అరుణభారతి సాహితి సాంస్కృతిక ఆధ్వర్యంలో కోవెలకుంట్ల లో సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటకం ప్రదర్శన**

**నాటక ప్రదర్శనకు ప్రోత్సాహం ఇచ్చిన బీసి రాజారెడ్డి**

బనగానపల్లె ఫిబ్రవరి 13 నందిపత్రిక ఆంగ్లేయుల సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించి ఎదురు నిలిచి పోరాటం చేసిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అరుణ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కోయిలకుంట్ల పట్టణం పాండురంగ స్వామి దేవాలయ ఆవరణలో బిసి రాజారెడ్డి సొంత నిధులతో గురువారం రాత్రి సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కర్నూలు టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో వివిధ జిల్లాలకు చెందిన ప్రఖ్యాత కళాకారులు నాటకంలోని పాత్రలకు జీవం పోయాగా సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ నాటక ప్రదర్శన ఏర్పాటు చేయడం తనకి ఎంతో సంతోషంగా ఉందన్నారు. రేనాటి వీరుని చరిత్రను హృదయానికి హత్తుకునే సంభాషణలతో రచించిన పల్లేటి కులశేఖర్ ని ప్రత్యేకంగా అభినందించారు. రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అంటే వీరత్వానికి మరో పేరు అన్నారు. బ్రిటిష్ పాలకులకు ఎదురునిలిచి భారతదేశ స్వాతంత్ర ఉద్యమానికి రాయలసీమ నుంచి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. నేటి కూడా సై సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అంటూ ఎంతోమంది జానపదాల రూపంలో ఆయన వీర గాథలను మనకు వినిపిస్తూనే ఉన్నారన్నారు. 2003లో తాను బనగానపల్లె సర్పంచ్ గా పనిచేసే సమయంలో బనగానపల్లెలో గ్రామపంచాయతీ పక్కనే సుందరమైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పార్క్ ను ఏర్పాటు చేసి అందులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. మళ్లీ ఇప్పుడు కోవెలకుంట్లలో సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శన ఏర్పాటు చేయడం తనకి ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాయలసీమ అంటే కవులు, కళాకారులకు పుట్టినిల్లు లాంటిదన్నారు. ఒకప్పుడు వారిని ఎంతో గౌరవించడంతోపాటు ప్రోత్సహించే వారన్నారు. నేటి ఆధునిక యుగంలో కవులు, కళాకారులకు ఆదరణ తగ్గిపోతుండడం ఎంతో బాధ కలిగిస్తుంది అన్నారు. అనంతరం రేనాటి సూర్యచంద్రులుగా వెలుగొందుతున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డిల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సభలో ప్రతిపాదించగా ప్రజలందరూ ఆమోదం తెలిపారు. అలాగే పత్తి ఓబులయ్య రచించిన రేనాటి సూర్యచంద్రుల పుస్తకాలను బిసి రాజారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మాజీ మండల అధ్యక్షులు బీవీ ప్రసాద్ రెడ్డి, ఉయ్యాలవాడ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, పాండురంగ స్వామి దేవస్థానం చైర్మన్ గుద్దేటి చిన్న వెంకటసుబ్బారెడ్డి , బనగానపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, ప్రముఖ వక్త ఇనాయతుల్లా పాల్గొన్నారు.



# హెచ్ ఎం బంగారు దుకాణంలో కిలాడి లేడీస్.

**యజమానిని మాటల్లో పెట్టి .**

**50 వేలు విలువచేసే వెండి పట్టీలు చోరీ.**

**బంగారు దుకాణాల యజమానులు జాగ్రత్త.**

**సి.సి.టీవీ ఫుటేజ్ లో కిలాడి లేడీల బండారం బట్టబయలు.**

**ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన.**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 13 ( నంది పత్రిక ). విఫణి విధుల్లో బంగారు,వెండి ధరలకు రెక్కలు వచ్చాయి.సామాన్య ,మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగిపోయాయి.బంగారు,వెండి ధరలు పెరిగిపోవడంతో మహిళలు గిల్ట్ నగలపై దృష్టి పెట్టారు.కొందరు కిలాడి మూలాలు ఇద్దరగా బంగారు,నగలు కొట్టేయడానికి మార్గాలను అన్వేసిస్తూ సఫలీకృతం అవుతున్నారు.దుకాణం యజమానులను మాటల్లో పెట్టి అందిన నగలు,వెండి వస్తువులు చిటికెలో మాయం చేస్తున్నారు.బంగారు వ్యాపారులు ఆదమరిస్తే వేలు,లక్షల వస్తువులు పోగొట్టుకుంటున్నారు.ఈ నేపథ్యంలోనే కొద్దిరోజులు క్రితం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణం బంగారు దుకాణాల బజారులో హెచ్,ఎం బంగారు దుకాణం ఉంది.కొద్ది రోజుల క్రితం ఆ దుకాణానికి ఇద్దరు కిలాడి మహిళలు వచ్చారు.దుకాణంలో వెండి పట్టీలు చూపించాలని యజమానితో అన్నారు.దుకాణంలో పని చేసే వారు కొన్ని పట్టీల ను వారి ముందు ఉంచారు.వారు తెలివిగా మాటలు పెట్టి మరిన్ని డిజైన్లు ఉన్న పట్టీలు చూపించాలని కోరారు.దీంతో మరికొన్ని పట్టీలు చూపించడానికి వెనక్కి తిరిగిన సమయంలో ముందుగా అక్కడ పెట్టిన వెండి పట్టీలు లో 50 వేలు విలువ చేసే వెండి పట్టీలు చేతి వాటం ప్రదర్శించారు.కొద్ది సేపు చూసి మరల వస్తామని చెప్పి వెళ్ళిపోయినట్టు సమాచారం.కాసేపటికి పట్టీలు సరి చూసుకుంటే వాటిలో 50 వేలు విలువ చేసే పట్టీలు మాయం అయినట్టు గుర్తించారు.దుకాణంలో ఉన్న సి.సి.ఫుటెజ్ పరిశీలించడంతో అంతకు ముందు వచ్చిన కిలాడి మహిళల పని అని గుర్తించారు.యజమాని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.కిలాడి మహిళల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది.బంగారు దుకాణాలు అయినా,ఇతర వ్యాపారాల్లో అయినా జాగ్రత్త లు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పణ



మహానంది,ఫిబ్రవరి 13 (నంది పత్రిక):- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ కామేశ్వరీ సహిత మహానందీశ్వర స్వామివార్లకు పట్టు వస్త్రాలను అందజేశారు.శుక్రవారం హైదరాబాదుకు చెందిన వారణాసి రామ్మోహన్ రావు,విజయలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలను ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డికి అందజేశారు.ప్రతి సంవత్సహారం స్వామి అమ్మవార్ల కల్యాణానికి ఆనవాయితీగా పట్టువస్త్రాలు అందజేస్తున్న విషయం తెలిసిందే.ఈ సందర్భంగా వేదపండితులు రవిశంకర్ అవధాని,నాగేశ్వర శర్మలు దాతలను వేదమంత్రోచ్చారణ మధ్య ఆశీర్వచనం చేసి స్వామివారి మెమెంటోతో పాటు ప్రసాదాలను అందజేశారు.

# మహానంది క్షేత్రంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





**సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ వైభవంగా ధ్వజారోహణం.**

**రావణ వాహనంపై విహరించిన మహానందీశ్వరుని దంపతులు**

మహానంది ఫిబ్రవరి 13 (నంది పత్రిక):- ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో శుక్రవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని,ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ,రుత్వికులు ఆధ్వర్యంలో ఉదయం గోపూజ,నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు.వేద పండితుల రవిశంకర్ అవధాని పండిత బృందం ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ ,గోపూజ ,క్షేత్ర పాలక పూజలు,ఉత్సవమూర్తులకు కంకణధారణ పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.మధ్యాహ్నం వాస్తు శాంతి,వాస్తుబలి,అంకురార్పణ,కలశ స్థాపన,అగ్ని ప్రతిష్ట,

అనంతరం సాయంత్రం బేరి పూజ,ధ్వజారోహణ పూజలు శాస్త్రక్తశీగా చేపట్టారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ఆలయ ప్రధాన ధ్వజ సంఘంపై నందీశ్వరుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

రాత్రి శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి దంపతులు రావణ వాహనంపై కొలువై ఆలయ ప్రాంగణంలో విహరించారు.ఉత్సవాలు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.







## మహానంది దేవస్థానానికి భక్తులు రూ 3.50 లక్షల విలువగల ఆభరణాలు విరాళం




మహానంది ఫిబ్రవరి 13 (నంది పత్రిక):- మహానంది దేవస్థానానికి భక్తులు రూ 3.50 లక్షల విలువగల ఆభరణాలు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో ఎన్.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన సుబ్రహ్మణ్యం,సంధ్యారాణి దంపతులు రాగితో తయారుచేసిన రాగితో చేసిన పాశంకుశాలు 2,అభయ హస్తాలు 2 పై బంగారు పూతతో ఆభరణాలను భక్తితో దేవస్థానం అర్చకులు మణికంఠ శర్మ ద్వారా ఈవోకు అందజేశారు.దాతలకు ఈవో అభినందనలు తెలిపారు.

## జిల్లాలో శైవాయాలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**




భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 13 నంది పత్రిక జిల్లాలో ప్రముఖంగా ఉన్న రెండు పంచారామ క్షేత్రాలతో పాటు, ప్రాముఖ్యత కలిగన శైవాలయాలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వెలగపూడి సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ సేవలపై ప్రజా సానుకూల స్పందన, మహాశివరాత్రి ఉత్సవాలు, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, కోర్టు భవనాల స్థలాలపై వీక్షణ సమావేశం నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి స్థాయి పెరగాలని సిఎస్ కోరారు. ఆ దిశగా లోపాలను సవరించుకుంటూ అధికారులు పనిచేయాలన్నారు. ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై దృష్టి సారించాలన్నారు. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో మహాశివరాత్రి ఏర్పాట్లు, పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలు ఏర్పాట్లుపై తీసుకున్న పకడ్బందీ చర్యలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సీఎస్ కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కేసముద్రం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ కు సమాన ఫలితాలు.

కేసముద్రం, ఫిబ్రవరి 13(నంది పత్రిక):కేసముద్రం వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు అధికారులు ప్రారంభించారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. 17 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రాగా ఒకటి చెల్లుబాటు కాలేదు. చెల్లుబాటైన 16ఓట్లలో 10 కాంగ్రెస్, 6 బిఆర్ఎస్ కు వచ్చాయి. 2వ వార్డులో బిఆర్ఎస్ 1, 4వ వార్డులో కాంగ్రెస్ 1, 6వ వార్డులో బిఆర్ఎస్ 1, 8వ వార్డులో కాంగ్రెస్1, బిఆర్ఎస్1, 10వ వార్డులో కాంగ్రెస్ 1, 11వ వార్డులో బిఆర్ఎస్ 2, 12వ వార్డులో కాంగ్రెస్ 1, 13వ వార్డులో కాంగ్రెస్ 4, 15వ వార్డులో కాంగ్రెస్ 2, బిఆర్ఎస్ 1ఓట్లు సాధించాయి.

కేసముద్రం నూతన మున్సిపాలిటీ ఎన్నికల విజేతలు: 1వ వార్డు జాటోత్ సుజాత (బిఆర్ఎస్), 2వ వార్డు బానోత్ సునీత (కాంగ్రెస్), 3వ వార్డు ధరావత్ కిశోర్ నాయక్ (కాంగ్రెస్), 4వ వార్డు దూడపాక కృష్ణ (బిఆర్ఎస్), 5వ వార్డు పురం రాజమణి(బిఆర్ఎస్), 6వ వార్డు పాయిరాల శరత్ (బిఆర్ఎస్), 7వ వార్డు రావుల వినయ్ రెడ్డి (బిఆర్ఎస్), 8వ వార్డు కనుకుల సుభద్ర(కాంగ్రెస్), 9వ వార్డు వేముల భారతి (కాంగ్రెస్), 10వ వార్డు మేకల శారద(బిఆర్ఎస్), 11వ వార్డు ఆగే రాము(బిఆర్ఎస్), 12వ వార్డు తరాల వీరేష్(కాంగ్రెస్), 13వ వార్డు డాక్టర్ అల్లం రమ(కాంగ్రెస్), 14వ వార్డు బానోత్ అరుణ కుమారి (బిఆర్ఎస్), 15వ వార్డు బానోత్ విజయ (కాంగ్రెస్), 16వ వార్డు వల్లందాస్ ఉమా(కాంగ్రెస్)లు విజయం సాధించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లు 8 స్థానాలను దక్కించుకున్నాయి. సమానంగా సీట్లు రావడంతో చైర్మన్ ఎవరనేది ఉత్కంఠగా మారింది. కేసముద్రం మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధితో వార్ వన్ సైడ్ అయితదనుకున్న కాంగ్రెస్ కు పూర్తి విజయం రాలేదు. వేచి చూడాలి చైర్మన్ ఎవరని?




# జనగామలోనూ తప్పని హంగ్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో 11 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది.

జహీరాబాద్, కేసముద్రం, కోహిర్, దేవరకద్ర, అలంపూర్, ఇస్నాపూర్, అమరచింత, జనగామ, ఆసిఫాబాద్, జమ్మికుంట, జిన్నారం, బోధన్, వేములవాడ, గద్వాల, ఆలియాబాద్ లో హంగ్ ఏర్పడింది. హంగ్ నేపథ్యంలో ఈ మున్సిపాలిటీల్లో స్వతంత్రులు కీలకం కానున్నారు. జనగామలో హంగ్ నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.

మున్సిపాలిటీ కైవసం చేసుకునేందుకు ఇండిపెండెంట్లు కీలకంగా మారారు. దీంతో చైర్మన్ పీఠం కోసం నలుగురు స్వతంత్ర అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఇక మిగిలిన వార్డుల్లో గెలిచిన అభ్యర్థులను పార్టీలోకి చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటాపోటీ పడుతున్నారు.

ఈ క్రమంలోనే ఆలియాబాద్ మున్సిపాలిటీలో ఓ అభ్యర్థిని పలువురు వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో

కాంగ్రెస్ 876 వార్డుల్లో గెలుపొందగా.. బీఆర్ఎస్ 462 వార్డుల్లో,

బీజేపీ 138 వార్డుల్లో విజయం సాధించింది. ఇక గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకుంది

## శివరాత్రి 15 ఆదివారమే తేల్చి చెప్పిన పండితులు

పరమ శివుడి పవిత్రమైన పర్వదినం మహా శివరాత్రి. మహా శివరాత్రి రోజు ఉపవాసంతో జాగారం చేస్తే ఎంతో పుణ్యంగా భావిస్తారు హిందూవులు. ఈ ఏడాది పండుగ ఏ రోజు వచ్చింది.. 15వ తేదీనా.. 16వ తేదీనా.. ఆదివారమా.. సోమవారమా అనే సందేహం చాలా మందిలో వ్యక్తం అవుతుంది. అందరూ 15వ తేదీనే మహారాత్రి అంటున్నా.. కొందరు మాత్రం 16వ తేదీ కదా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. హిందూ మతంలో అత్యంత పవిత్ర పండుగల్లో ఒకటి అయిన మహాశివరాత్రి ఫిబ్రవరి 15వ తేదీ నాడు జరుపుకోవాలని పండితులు నిర్ణయించారు. చతుర్దశి తిథి ప్రారంభం: ఫిబ్రవరి 15 సాయంత్రం 5:04 గంటలకు ప్రారంభమై, తిథి ముగింపు: ఫిబ్రవరి 16 సాయంత్రం 5:34 గంటల వరకు ఉంటుంది. నిషిత కాల ముహూర్తం : ఫిబ్రవరి 15 12:09 నుండి 1:01 ఉంటుంది. హిందూ పండుగలను సాధారణంగా ఉదయ తిథి ..సూర్యోదయం.. ఆధారంగా జరుపుకున్నప్పటికీ, నిషిత కాలంలో చతుర్దశి వచ్చే రోజున మహాశివరాత్రిని జరుపుకుంటారు.

# కాంగ్రెస్ గెలుపు పై ఆశ్చర్యం అవసరం లేదు


**అభివృద్ధి కోసం అధికార పార్టీకి ప్రజలు పట్టం**

**పట్టణాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం**

**బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు**

**ఆందోజు శ్రీనివాస్ చారి వెల్లడి**

ఫిబ్రవరి 13 రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపొందినంత మాత్రాన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని అభివృద్ధి కోసం అధికార పార్టీకి ప్రజలు ఓట్లు వేశారని అధికారంలో ఉన్నందున ఆ పార్టీకి ఓట్లు వేస్తే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు భావించి ఓట్లు వేశారని బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందోజు శ్రీనివాస్ చారిఅన్నారు. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ గెలిచినంత మాత్రాన గొప్పగా ప్రచారం చేసుకోవడం ఆర్భాటం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటివరకు రెండు సంవత్సరాలు గడిచినా కూడా ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటివరకు రైతులకు రైతు భరోసా పథకం కింద ఆర్థిక సహాయం అందించలేదని అదేవిధంగా ఆసరా పెన్షన్ ద్వారా పెన్షన్లు రెట్టింపు చేస్తామని చెప్పి అమలు చేయలేదని అన్నారు. అదేవిధంగా ఆడపిల్ల వివాహానికి తులం బంగారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. ఉచిత ఆరోగ్య పథకాలలో ఒక్క పథకం తప్ప మిగతా పథకాలకు పంగనామా పెట్టిందని ఎద్దేవ చేశారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ పుణ్యం వల్ల రాష్ట్రానికి కేంద్రం వేలాది కోట్ల రూపాయల నిధులను వివిధ సంక్షేమ పథకాలకు అభివృద్ధి పనులకు మంజూరు చేస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నిర్వీర్యం చేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం ఎవరు ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంతేకాక గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే అట్టి నిధుల ద్వారా గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రులు ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు. సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్న విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పట్టణ మున్సిపాలిటీల అభివృద్ధి విషయంలో సిసి రోడ్లు డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, రోడ్డు వెడల్పు పనులు, వంటి అభివృద్ధి పనులకు బిజెపి ప్రభుత్వం నిధులు ఇస్తున్న సంగతి నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన నిధుల వల్లనే నాగర్ కర్నూల్ పట్టణ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు పట్టణాలకు గ్రామాలకు మంజూరు చేయలేదని తీవ్రంగా ఆరోపించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్లపై తిరుగుతుంటే ఈ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన ఈ ప్రభుత్వం మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలిచి సంబరాలు చేసుకోవడం సంతోష పడడం బాధాకరమని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పట్టణాలలో గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులు ప్రజా సమస్యలను రైతు సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు ఎక్కడ కూడా సంక్షేమం సంక్షోభంలో పడిందని ఎక్కడ కూడా అభివృద్ధి ముందుకు సాగడం లేదని ఒక్క రూపాయి కూడా నిధులు ఈ ప్రభుత్వం మంజూరు చేయలేదని కేవలం భూమి పూజలు శంకుస్థాపనలు చేయడం తప్ప ఎక్కడ ఒక పని కూడా చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు అన్న సంగతి గుర్తు పెట్టుకోవాలి అని అందుకే ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు మూడోసారి ముచ్చటగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని చేసిన విషయం గుర్తు చేసుకోవాలని ఆయన సూచించారు. తిరిగి 2029 లో జరిగే ఎన్నికల్లో కూడా కేంద్రంలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రావడం తథ్యమని అందులో ఎలాంటి అనుమానం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటం వదిలిపెట్టి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## కేసముద్రం మున్సిపాలిటీలో 8 వార్డుల్లో బిఆర్ఎస్ విజయం



**కేసముద్రం, ఫిబ్రవరి 13(నంది పత్రిక):** నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల ఫలితాల్లో ప్రతిపక్ష బిఆర్ఎస్ 8 స్థానాలను కైవసం చేసుకుంది. 16 వార్డు స్థానాలు ఉన్న కేసముద్రం మున్సిపాలిటీలో బిఆర్ఎస్ 8 స్థానాలు గెలుచుకోవడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు స్పష్టమైన ఆధిక్యత రాలేదు. క్యాంపు రాజకీయాలు, ఎక్స్ అఫీషియో ఓట్లతో చైర్మన్ గిరిని దక్కించుకునేందుకు ఇరు పార్టీలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## మహానంది పుణ్యక్షేత్రంలో బ్రహ్మశ్రీ డా.చాగంటి కోటేశ్వరరావు పూజలు



**మహానంది ఫిబ్రవరి 13 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ డా.చాగంటి కోటేశ్వరరావు దంపతులు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.ముందుగా ఆలయానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.వీరు స్వామి అమ్మవార్లను దర్శించుకొని అభిషేకార్చన పూజలు నిర్వహించుకున్నారు.దర్శనం అనంతరం ఈవో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి,జ్ఞాపిక అందజేయగా,వేదపండితులు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.చాగంటి కోటేశ్వరరావు ఈఓతో మాట్లాడుతూ మహానంది అద్భుతమైన క్షేత్రం అని దీని ప్రాశస్త్యం గురించి ప్రచారం చేయాలన్నారు.నవనంది ప్రదక్షిణం అరుణాచల ప్రదక్షిణం కన్నా విశేషమని దానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.త్వరలో దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తానని తెలిపారు.



# ఉడిపి శ్రీకృష్ణ మఠం విశిష్టత.



**మంత్రాలయం పిబ్రవరి13 (నందిదినపత్రిక ప్రతినిధి)** ఉడిపి శ్రీకృష్ణమఠంలో ప్రసాదం నేలపైనే ఎందుకు పెడతారు. దేవుడి దర్శనం కిటికీలో నుంచే 9 రంధ్రాల ద్వారా మాత్రమే దర్శించు కోవాలి. ఉడిపి శ్రీకృష్ణ పరమాత్ముడిని కిటికీకి ఉన్న 9రంధ్రాల ద్వారా మాత్రమే దర్శించుకోవాలి. నేరుగా శ్రీకృష్ణ విగ్రహాన్ని చూడలేరు. ఈ ఆలయంలో బాల రూపంలో ఉన్న చిన్ని కృష్ణుడు దర్శనమిస్తారు. అంతేకాదు ఈఆలయం బాలరూపంలో ఉన్న చిన్ని కృష్ణుడు దర్శనమిస్తారు. అంతేకాదు ఈఆలయంలో ప్రసాదం నేలపైనే వడ్డిస్తారు. కిటికీ నుంచే ఎందుకంటే... శ్రీకృష్ణ పరమాత్ముడు తన భక్తులలో ఒకరికి దర్శనమిచ్చి కిటికీతయారుచేయంచమని. అది ఎలా ఉండాలో తెలుపుతూ.. 9 రంధ్రాలు ఉండేలా తయారు. ఉడిపి ఆలయంలో తన ఎదురుగా ఏర్పాటు చేయాలని ఆదేశించాడట. ఆకిటికీ రంధ్రాల ద్వారానే భక్తులు తనను దర్శించుకుంటారని చెప్పి అంతర్ధానమయ్యాడని స్థానికులు చెబుతుంటారు. స్వామి ఆదేశాల ప్రకారం ఆభక్తుడు అలానే కిటికీని చేయించి స్వామి సూచించిన ప్రదేశంలో నెలకొల్పాడు. ఆ తర్వాత 13వ శతాబ్ధంలో మాధవాచార్యులుఆలయాన్నినిర్మించారు. కేదార్ నాథ్ కంటే ఎత్తులో ఉండే ఈతుంగానాథ్ ఆలయం ఎంతమందికి తెలుసు. 13వ శతాబ్ధంలో ఒకసారి మాధవాచార్యులు సముద్ర తుఫానులో తన ఓడచిక్కుకు పోయింది. అప్పుడు శ్రీకృష్ణుడినిప్రార్థించగా..చిక్కుకున్న ఓడను రక్షించాడని చెబుతారు. ఈఓడ ఒడ్డుకు చేరుకున్నపుడు.. సముద్రపు మట్టితో కప్పిన శ్రీకృష్ణుడి విగ్రహం కనిపించింది. అప్పుడు చాశ్రీప్తుఎంబశ్రీఅశ్రీశ్రీఘప్త శ్రీకృష్ణ విగ్రహాన్ని తెచ్చి ఉడపి ఆలయంలో ప్రతిష్టించాడు. నేలపైనే ప్రసాదం:- భక్తులు తమ కోరికలు నెరవేరిన భక్తులు... వారే నేలమీద వడ్డించమని అడుగుతారు. అందుకే ఆలయంలో నేలపై ప్రసాదం వడ్డిస్తారు. స్వామి దర్శనానికి గంటల తరబడి వేచి ఉండాలి. పర్వదినాల్లో శ్రీకృష్ణాష్టమి, ఏకాదశి, పుణ్యతిథులు.. పండుగ రోజుల్లో బాగా రద్ధీగా ఉంటుంది. అలాంటి ఆలయాన్ని విద్యుత్ దీపాలు. పూదండలతోఅలంకరిస్తారు. ఎలా వెళ్ళాలి.. ఉడిపిలో దేవాలయంలో కర్ణాటక రాష్ట్రం ఉంది. ఉడిపిలో రైల్వేస్టేషన్.. బస్టాండు ఉన్నాయి. రైలు మార్గం ద్వారా చేరుకోవాలంటే.. స్టేషన్ నుంచి 3.2కిలో మీటర్లు . ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి చేరుకోవచ్చు. విమానంలో వెళ్ళాలంటే మంగుళూరు అంతర్జాతీయ విమానా శ్రయంలో ల్యాండు అవ్వాలి. అక్కడినుంచి 59కిలోమీటర్లు రోడ్డు మార్గంలో వెళ్ళి బాలరూపంలో ఉన్న చిన్ని కృష్ణుడిని దర్శించు కోవాలి.



## ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు

**కల్వకుర్తి ఫిబ్రవరి 13 ప్రతినిధి/రామానుజన్** కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో ఉత్కంఠ భరిత పరిణామం చోటు చేసుకుంది. పదవ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఏజాస్ కేవలం ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థికి 259 ఓట్లు లభించగా, బిఆర్ఎస్ అభ్యర్థి తాహెర్ కు 258 ఓట్లు వచ్చాయి. మొదటిసారి ఓట్ల లెక్కింపులో ఒక కాంగ్రెస్కు రెండు ఓట్ల ఆధిక్యం కనిపించడంతో అధికారులు రేకౌంటింగ్ నిర్వహించారు. రీకౌంటింగ్ అనంతరం ఒక ఓటు తేడాతో కాంగ్రెస్ విజయం ఖరారు అయింది. ఈ ఫలితం ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంత కీలకమో మరోసారి నిరూపితమైంది. ప్రతి ఓటు ప్రాముఖ్యత, ఓటర్ల చైతన్యం ఎంత కీలకమో ఈ సంఘటనను చూపిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలు

### రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్

### మరింత పటిష్టం కానున్న భారత్ రక్షణ రంగం

భారత రక్షణరంగ పటిష్టత దిశగా మరో కీలక ముందడుగు పడింది. రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డిఫన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సుమారు రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో జరిగే ఈ కొనుగోళ్లలో 120 స్వల్ప శ్రేణి క్షిపణలు, 168 సుదీర్ఘ శ్రేణి క్షిపణలు ఉన్నాయి. ఇప్పటికే కాంట్రాక్ట్ జరిగిన మరో రెండు ఎస్-400 వ్యవస్థలు ఈ ఏడాది జూన్, నవంబర్‌లో భారత్‌కు అందనున్నాయి. ఆపరేషన్ సిందూర్' సమయంలో ఉపయోగించిన క్షిపణుల నిల్వలను పునరుద్ధరించడం, వాయి రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం తాజా కొనుగోళ్ల ముఖ్య ఉద్దేశంగా డిఫెన్స్ వర్గాలు తెలిపాయి. ఇదేవిధంగా చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, 400 కిలోమీటర్ల పరిధిలో వైమానిక ముప్పును సమర్ధవంతంగా ఎస్-400 వ్యవస్థ అడ్డుకుంటుందని పేర్కొన్నాయి. పాకిస్థాన్‌తో గత ఏడాది తలెత్తిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 వ్యవస్థ శత్రువుల వెన్నులో చలిపుట్టించింది. 314 కిలోమీటర్ల దూరంలోని పాక్ యుద్ధ విమానాన్ని కుప్పకూల్చింది. ఆదంపూర్, భుజ్ సెక్టార్లలో ఈ వ్యవస్థను మోహరించడంతో పాక్ గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ యుద్ధ విమానాలను ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ సరిహద్దులకు తరలించాల్సి వచ్చింది. ప్రస్తుతం కొనుగోలు చేయనున్న 400 కి.మీ, 200 కి.మీ, 150 కి.మీ, 40 కిలోమీటర్ల శ్రేణి క్షిపణులు శత్రువుల విమానాలు, డ్రోన్ దాడులను సమర్ధవంతంగా తిప్పికొట్టగలవు.

## కాశ్మీర్‌తో కలిపి భారత్ మ్యాప్

భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిన వేళ.. అమెరికా వాణిజ్య ప్రతినిధి భారత్ మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ గగ్గోలు పెట్టింది. చివరకు అగ్రరాజ్య అధికారులకు నచ్చజెప్పి ఆ మ్యాప్‌ను తొలగింపజేశారు. కశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. కశ్మీర్‌ను జీవనాడిగా చెప్తూ.. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. ఇలాంటి సమయంలో దాయాది పేర్కొంటున్నట్టుగా కాకుండా.. భారత్ మ్యాప్ ఉన్నది ఉన్నట్టుగా అమెరికా షేర్ చేసింది. దీన్నిచూసి తట్టుకోలేకపోయిన పాకిస్థాన్.. అమెరికా అధికారులను ఒప్పించి, దాన్ని తొలగించాలని ప్రాధేయపడటంతో వారు దానిని తొలగించారు.

## చీనాబ్ నదిపై సావల్‌కోట్ ప్రాజెక్టు వివరాలు కోరిన పాక్ విదేశాంగ ప్రతినిధి

కశ్మీర్‌లో చీనాబ్ నదిపై భారత్ నిర్మించనున్న సావల్‌కోట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని పాకిస్థాన్ కోరింది. ఈ మేరకు భారత్‌కు లేఖ రాసినట్లు ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తాహిర్ వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సావల్‌కోట్ ప్రాజెక్టు అంశాన్ని ఇది వరకే ఇండస్ వాటర్ కమిషనర్ల స్థాయిలో చర్చించినట్లు తెలిపారు. ఇదే అంశంపై గతేడాది జులైలో పాక్ ఇండస్ వాటర్ కమిషనర్ భారత్‌కు లేఖ రాసినట్లు చెప్పిన ఆయన.. తాజాగా మరోసారి లేఖ రాశారని అన్నారు.'ఫిబ్రవరి 11న పాక్ ఇండస్ వాటర్ కమిషనర్, భారత్ ఇండస్ వాటర్ కమిషనర్‌కు లేఖ రాశారు. సింధు జలాల ఒప్పందం 1960 అనుసరించి సావల్‌కోట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని లేఖలో కోరారు.' అని తాహిర్ మీడియాకు వివరించారు. గతేడాది ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌పై భారత్ చర్యలకు ఉపక్రమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సింధు నదీ జలాల ఒప్పందం అమలును నిలిపివేసింది.చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు 40 ఏళ్లుగా పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే, సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేయడం.. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నారు.

## 19 నుంచి శుభముహూర్త కాలం ఎప్రిల్ 29 వరకు ఉంటాయంటున్న పండితులు

ధనుర్మాసం.. మౌఢ్యమితో శుభ ముహూర్తాలు లేక ఇంతకాలు వివాహాలు, ఇతర శుభకార్యాల జరగలేదు. ముహూర్తాలు లేక వివాహాలు నిలిచి పోయిన వారికి ఇది శుభవార్తే. ఈ నెల 19వ తేదీ నుంచి వరుస ముహూర్తాలతో పెళ్లి సందడి ప్రారంభం కానుంది. నాలుగు నెలల పాటు వరుస ముహూర్తాలతో వివాహ వేదికలు కళకళ లాడనున్నాయి. మౌఢ్యమి రోజుల్లో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకుంటే శుభ ప్రథంగా ఉండదని పండితులు చెప్పారు. దీంతో ఆయా దినాల్లో ఆయా కార్యాలు జరగలేదు. ఈక్రమంలో మే వరకు అన్ని రకాల శుభకార్యాలకు అనుకూల మైన రోజులు ఉన్నట్లు పండితులు చెపుతున్నారు. ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 29 వరుకు ముహూర్తాలు ఉన్నట్లు పండితులు ప్రకటించారు.మౌఢ్యమి కారణంగానే డిసెంబరు నుంచి శుభ ముహూర్తాలు లేవు. ఈ కారణంగా వివాహాలు, ఇతర శుభకార్యాలు నిలిచిపోయాయి. ఈ సంవత్సరం ఎక్కువ ముహూర్తాలు ఉన్నందున వివాహాలు కూడా ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. దీంతో అటు వస్త్ర, బంగారం వ్యాపారాలు కళకళ లాడనున్నాయి.

## ఊర్వశి అప్సర సాధన ఎందుకు కష్టం?



**మంత్రాలయం పిబ్రవరి13 (నందిదినపత్రిక ప్రతినిధి)** ఊర్వశి అప్సర సాధన ఎందుకు కష్టమని ఎవరు చెప్పారు. అదిచాలా చాలా సులభం. ముద్గలుడనే ఓబ్రాహ్మణుడు ఉండేవారు. సత్యనిష్ఠాగరిష్టుడు. అందరికీ సహాయం చేస్తూ, ఏదయినా పెడితే తింటూకాలం గడిపే వాడు. పక్ష ఉపవాసం అనే వ్రతం పాటించేవాడు అంటే పాడ్యమి నుండి చతుర్ధశి దాకా ఉపవాసం ఉండి పౌర్ణమి అమావాస్య నాడు మాత్రమే భోజనం చేయడం. ఇతనినిపరీక్షించిసంతోషించిన దుర్వాసమహర్షి ఇతనికి స్వర్గ లోకవాసాన్నివరంగాఇచ్చారు. దేవతలు వచ్చారు ఈయన్ని స్వర్గానికితీసుకునివెళ్ళడానికిఅక్కడే ఉండిపోవచ్చా అని అడిగాడు వారిని.పుణ్యఫలం అవగానే మళ్ళీ భూమిమీద పుట్టాలన్నారు. పుణ్యఫలం అయిపోగానే మళ్ళీ భూలోకంలో పుట్టేదానికి స్వర్గవాసం ఎందుకు. నేను ఇక్కడే ఉండి జన్మరాహిత్యం కోసం సాధన చేసుకుంటాను. మీరు వెళ్ళండి అన్నాడు ముద్గలుడు. ముద్గలుడులా ఉండగలిగితే అతి సులభంగా స్వర్గం చేరిపోవచ్చు. అక్కడ ఊర్వశితో బాటు రంభ, మేనక, తిలోత్తమ కూడా ఉంటారు మీకోసం ఎదురు చూస్తూ. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అలా ఆయనలా సాధన చేసాక స్వర్గంవద్దు, ఊర్వశివద్దు " అంటారేమో తమరు. ఆలోచించి సాధన మొదలు పెడితే నయం.

# చరిత్ర మరచిన వీరనారి తిమ్మమాంబ.



-దైవందిన్నె సంస్థానానికి వన్నె తెచ్చిన ఆడపడుచు.

-గుజ్జువంశస్థుల ఆడబిడ్డకు దైవందిన్నెలో ఆలయం.

**మంత్రాలయం పిబ్రవరి13. (నందిదిన పత్రి క ప్రతినిధి)** అలనాటి చారిత్రక ఆనవాళ్లు కాలగర్భంలో కరిగిపోతూ ఉన్నాయి. నాటి రాచరిక వ్యవస్థ భవిష్యతరాలకు స్ఫూర్తి కల్పించాలంటే నాటి పాలకుల ప్రజారంజక పాలన, రైతు సంక్షేమంపై చేపట్టిన చర్యలు, భారతీయ కళలు అంతరించి పోకుండా ఆపాలకులు ఆదరించిన కళాపోషణ,ఆపత్సమయలో వారి వీరోచిత యుద్ధవిద్యలనైపుణ్యాలు, వారి పాలనలో రూపుదిద్దుకొని వికశించిన ఆధ్యాత్మిక ఆలయాలు, సహచర రాజులతో వారి సన్నిహిత సంబంధాలు తదితరాలపై భావి తరాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు చరిత్ర పుటల్లో నాటి వైభవాలకు చోటు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నది నగ్న సత్యం. మహారాజులే కాదు మహారాణులు సైతం రాజ్యాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారన్న నగ్నసత్యాలను తెలుగు ప్రజల ముంగిళ్ళకు తీసుకు రావాలనే ఆలోచనే ఈకథనం. ఆడపిల్ల ఆమబల కాదు ఆగ్రహిస్తే అపరకాళిలా మారి ప్రతీకారం తీర్చు కుంటుందని ఒక తెలుగింటి రాజపడుచు 800 సంవత్సరాలకు పూర్వమే రుజువు చేసింది. ఆమే వేరెవ్వరో కాదు నేటి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలపరిధిలోని దైవందిన్నె సంస్థానం రాకుమారి తిమ్మమాంబ. భర్త హత్యకు ప్రతీకారంగా గోల్కొండ నవాబు సైన్యాధ్యక్షుని తలనరికిన వీరనారి ఆమె. భర్తమృతదేహంతో పాటు సహగమనంచేసి కన్నవారింటి ఇలవేల్పుగా వెలసిన ధీరవనిత. దైవందిన్నె సంస్థానం:- గోల్కొండ నవాబులు పరిపాలిస్తున్న సమయంలో ప్రస్తుత ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని దైవందిన్నె గ్రామం నాడు ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన రాజ సంస్థానం. ఈసంస్థానాన్ని గుజ్జు వంశస్తుడైన పెద్దారెడ్డి భూపతి పాలించేవాడు. ఈయన సతీమణి మల్లాంబ. ఈరాజ దంపతులకు చాలాకాలం వరకు సంతానం కలుగలేదు. సంతానప్రాప్తి కొరకు తమ రాజగురువునుఆశ్రయించారు రాజదంపతులు.రాజదంపతులకు సంతానయోగం ఉందని, మొదటి సంతానంగా బాలుడు, రెండవ సంతానంగా బాలిక జన్మిస్తారని వీరిలో బాలిక అనన్య ప్రతిభా పాటవాలతో వీరకాంతగా, వీరపత్నిగా, వీరమాతగా వాసికెక్కుతుందని మునీశ్వరుడు సెలవిచ్చి రాజదంపతులను ఆశీర్వదించారు. ఆముని ఆశీర్వాదంతో ఆరాజదంపతులకు మొదట నాగిరెడ్డి అనుకుమారుడు జన్మించాడు. రెండవ సంతానంగా తిమ్మాంబ జన్మించింది. మౌనీశ్వరుని ఆశీర్వాదంతో తిమ్మమాంబ విద్యాబుద్ధులతో రాణిస్తూనే యుద్ధవిద్యల్లోనూ ఆరితేరింది. 16సంవత్సరాల వయస్సు లోనే తిమ్మమాంబ అపూర్వ సౌందర్యరాశిగా ఎదిగింది. ఆమెకు యుక్తవయస్సు రావటంతో పెద్దారెడ్డిభూపతి ప్రస్తుత నందికొట్కూరు సమీపంలోని సాథాన్ కోట ప్రభువు చంద్రశేఖర రెడ్డితో వివాహం జరిపించారు.

వివాహానంతరం తిమ్మాంబ సాథాన్ కోటకు వెళ్ళింది చంద్రశేఖరరెడ్డి, తిమ్మాంబ దంపతులకు రామచంద్రారెడ్డి జన్మించాడు. సాథాన్ కోటను చుట్టుముట్టిన కరువు కాటకాలు:-వర్షాభావ పరిస్థితులు చుట్టు ముట్టడంతో సాథాన్ కోట రాజ్యం కరువు కాటకాలతో విలవిలలాడింది. ఈకారణంగా రాజ్యంలోని ప్రజల నుంచి పన్నులు కట్టించుకోవడం ఆపేశాడు. ఖజానాలోని ధనాన్ని ప్రజలను ఆదు కొనేందుకు వినియోగించారు. దీంతో గోల్కొండ నవాబుకు సకాలంలో కప్పం చెల్లించలేక పోయాడు. దీంతో ఆగ్రహించిన నవాబు సాతాను కోటరాజు నుంచి కప్పం వసూలు చేసుకు రావాలని మంత్రి ఖాధర్ ఖాన్, ఈయన కుమారుడైన సేనాపతి వల్లీఖాన్లను ఆదేశించారు. వారితోపాటు నవాబు సైతం సాథాన్కోటకు బయలు దేరారు. వీరి రాకను స్వాగతించిన రాజు చంద్రశేఖరరెడ్డి రాజ్యంలో కరువు కాటకాలు వివరించి కప్పం చెల్లించే వరకు సాథాన్ కోటలోనే ఉండమని సేనాధిపతిని ఆదేశించిన నవాబు గోల్కొండకు వెళ్ళిపోయారు. కప్పం పేరుతో సేనాపతి సాథాన్ కోటలో బిచాణా వేశాడు.ఒకరోజుమంత్రి కోరిక మేరకు రాజు చంద్రశేఖరరెడ్డి కోటలోని సైన్యంతో వేటకై అడవికి వెళ్ళారు. కోటలో ఒంటరిగా ఉన్న గోల్కొండ సేనాపధిపతి వలీఖాన్ శిరోభారంతో ఉద్యానవనంలోకి వెళ్ళాడు.అక్కడ పువ్వులు కోస్తున్న అపురూప సౌందర్యరాశి అయిన రాణి తిమ్మమాంబను సేనాపతి చూసి మతి భ్రమించిన వలీఖాన్ రాణిని చేరుకోబోగా ఆమే తీవ్రంగా మందలించి కోటకు వెళ్ళిపోయింది. కోటలో తన చెలికత్తెను పిలిచి నవాబుకు చెల్లించేందుకు కప్పం డబ్బు తీసుకువచ్చేందుకు తాను దైవందిన్నె సంస్థానానికి వెళ్ళు తున్నానని రాజు వేటనుండి రాగానే ఈవిషయం తెలియజేయాలని చెప్పి రాణితిమ్మమాంబ వెళ్ళి పోయింది. మధోన్మత్తుడైన వలీఖాన్ కోటకు చేరుకొని తిమ్మమాంబ ఆచూకీ చెప్పకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిన చెలికత్తె రాణి దైవందిన్నెకు వెళ్ళిందని చెప్పింది. అది విన్న వలీఖాన్ వెంటనే దైవందిన్నెకు వెళ్ళి తిమ్మాంబనుతీసుకురావాలని లేదంటే నిన్ను చంపేస్తానని చెప్పడంతో బెదిరిపోయిన చెలికత్తె దైవందిన్నెకు వెళ్ళిపోయింది.ఇదేమీ తెలియని రాజు చంద్రశేఖరరెడ్డి వేటబడలికతో కోటకు రాగానే అలసిపోయి నిద్రపోయాడు. చంద్రశేఖరరెడ్డిని హత్యచేసిన వలీఖాన్. ఉద్యానవనంలో జరిగిన సంఘటనను తిమ్మాంబ రాజుకు చెబితే తనకు చావుతప్పదని భావించిన వలీఖాన్ రాణి వచ్చే లోగానే రాజును చంపితే చాలు ఇటు రాజ్యంతో అటు రాణి కూడా తనవశం అవుతుందని భావించాడు. అనుకున్నదే తడువుగా నిద్రిస్తున్న రాజు చంద్రశేఖరరెడ్డిని వలీఖాన్ హత మార్చాడు. దీన్ని గమనించిన చంద్రశేఖరరెడ్డి మంత్రి రాజు మృతదేహాన్ని రహస్యంగా నూనె పాత్రలో భద్రపరచి దైవందిన్నె సంస్థానానికి వెళ్ళిపోయిడు. అంతకంటే ముందుగానే దైవందిన్నెకు చేరుకొన్న చెలికత్తె పెద్దారెడ్డికి సమాచారం చేరవేసి వెళ్ళి పోయింది. దైవందిన్నెకు చేరుకొన్న మంత్రి రాజుపెద్దారెడ్డికి జరిగిన సంఘటన చేరవేశాడు. ఈవిషయాన్ని తిమ్మమాంబకు తెలియనీయ కుండా ఆమెతో కలిసి సాథాన్ కోటకు చేరుకున్నారు. అక్కడ చెలికత్తె ద్వారా భర్తహత్యో దంతం తెలుసుకొన్న తిమ్మమాంబ ఉగ్రరూపంతో గదిలో దాక్కున్న వలీఖాన్ ను పరుషపు మాటలతో గది బయటకు వచ్చేలా చేసింది. గది బయటకు రాగానే వలీఖాన్ తలను ఒక్క వేటుతో తెగనరి కేసింది. భర్త మృతదేహంతో సహగమనం:-తన భర్తమృత దేహంతోపాటు తానూసహగమనం చేస్తానని తీమ్మమాంబ తండ్రి పెద్దారెడ్డి అనుమతి కోరింది. అందుకాయన ఓప్పుకోక పోవడంతో తాను తనభర్త మృతదేహం చెంత పడుకుంటాను వెంటనే ప్రాణం పోతేసరి లేదంటే పక్కకు తీయమని కోరడంతో తండ్రి సరేనన్నాడు. క్షితిపై భర్తమృత దేహం పక్కన పడుకోగానే తిమ్మమాంబ మరణించింది. జరిగిన సంఘటనతో శోకతప్త హృదయాలతో సంస్కారాలు నిర్వహించిన తర్వాత రామచంద్రా రెడ్డికి పట్టాభిషేకం నిర్వహించాడు పెద్దారెడ్డి భూపతి. స్వప్నంలో తల్లిని తట్టిలేపిన తిమ్మమాంబ:- సాతాన్ కోటలో జరిగిన విషయాలు తెలియని తిమ్మాంబ తల్లి గాఢ నిద్రలో ఉండగా



ఎవరో తనను తట్టి లేపినట్లు కలగంది. కలలో తన నగలను దైవందిన్నె సంస్థానంలోని శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి మూర్తులకు అలంకరించేందుకు సాథాన్ కోట నుంచి తలారికి ఇచ్చిపంపగా ఆతలారి ఆనగలను కాజేయాలని దైవందిన్నె గ్రామం సమీపంలోని కంపాడుగ్రామం దగ్గర ఉన్న నల్లవంకలో ఫలానాస్థలంలో పూడ్చిపెట్టడం వల్లతలారి చనిపోయాడని,ఆనగలనుతెప్పించి దేవిడీలోని అలయానికి కానుకగా ఇవ్వాలని తిమ్మాంబ తల్లి మల్లాంబను కోరింది. కలనుంచి మేల్కొన్న మల్లాంబ భజాలు చూసు కోగా భుజంపై నూనె గుర్తులతో చేతి అచ్చులు గమనించిన మల్లాంబ సేవకుడిని నల్లవంకకు పంపి వంకలో తలారి పడిన ప్రాంతంలో ఇసుక తవ్వి అక్కడ దాచిన నగలను దేవిడీలోని ఆలయానికి అందజేసింది మల్లాంబ. గుజ్జు వంశంలో వంశస్తుల ఇళ్ళలో వివాహాలు జరిగే ముందు వధూవరుల పట్టుపీతాంబరాలు, పుస్తెలు, కాలిమెట్టెలు తనసన్నిధిలో ఉంచి పూజలు చేయాలని, మన వంశంలో పుట్టేపిల్లలకు పాలుపట్టే గరిటను, ఉయ్యాలను కొనరాదని అలా చేయడంవల్ల మేలు జరుగు తుందని తిమ్మాంబ తల్లికి వరం ఇచ్చింది. వీరనారి తిమ్మాంబకు దైవందిన్నెలో ఆలయం:- వీరనారిగా, వీరపత్నిగా, వీరమాతగా విశిష్టతను సంతరించుకొన్న తిమ్మమాంబకు దైవందిన్నెలో ఆలయం నిర్మించి గుజ్జువంశస్థులు పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతియేటా ఏప్రిల్ మాసంలో దైవందిన్నె దేవిడీలోని శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామికి తిమ్మమాంబ కానుకగా ఇచ్చిన నగలను అలంకరించి రథోత్సవం నిర్వహిస్తున్నారు. ఇంతటి విశిష్టత సంతరించుకొన్న తిమ్మమాంబను చరిత్రకారులు మరచిపోవడం బాధాకరం. గతంలో సుమారు 50 సంవత్సరాల క్రితం దైవందిన్నెలో సురభికంపెని ఆధ్వర్యంలో వీర తిమ్మమాంబ నాటకం ప్రదర్శించడం గమనార్హం. ఈ వీరతిమ్మాంబ మాఇంటి ఆడపడుచు. మాఇళ్ళలో వివాహాల సమయంలో వధూవరుల పట్టబట్టలను వీరతిమ్మాంబ ఆలయంలో ఉంచి పూజలు నిర్వహించిన తర్వాత ఆపట్టు బట్టలను వధూవరులకు ఇవ్వడం జరుగుతోంది.



## బుక్కాపురంలో విద్యుత్ సిజిఎం తనిఖీ



**మహానంది, ఫిబ్రవరి 13 (నంది పత్రిక):-** మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో కరెంట్ టోల్ల పల్లెబాట కార్యక్రమాన్ని ఏపీఎస్పి డిసిఎల్ కు చెందిన 6 జిల్లాల సీజీఎం,చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య శుక్రవారం తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా ఆయన పలువురు విద్యుత్ వినియోగదారులను విద్యుత్తుకు సంబంధించిన అంతరాయము,వాటికి సంబంధించిన కారణాలు విద్యుత్ శాఖ సిబ్బంది లేదా అధికారులు మీకు సహకరిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కరెంటోల్ల పల్లె బాటవల్ల ఏమన్నా మీకు ఉపయోగాలు కనిపిస్తున్నాయా అని ప్రశ్నించారు.రైతులకు సకాలంలో పంటలు పండించుకోవడానికి అవసరమయ్యే విద్యుత్ ను సప్లై చేస్తున్నారా, లో వోల్టేజ్ సమస్యలు ఏమైనా ఉన్నాయా అలాంటివి ఉంటే తమకు తెలియజేస్తే ఎక్కడ లోపాలు ఉన్నాయో సరి చేస్తామన్నారు. విద్యుత్తు సప్లై రాబోయే వేసవి సీజన్లో అధికంగా ఉంటుందని డిమాండు, సప్లై ఆధారంగా తాము గృహ మరియు వ్యవసాయ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారులు కూడా తమ శాఖకు సంబంధించి సూచనలు సలహాలు చేస్తూ ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామివారికి వైభవంగా భస్మాభిషేకం




**మహానంది ఫిబ్రవరి 13 (నంది పత్రిక):-** మహానంది మండలం కేంద్రం తిమ్మాపురం గ్రామంలో వెలసిన శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారికి వైభవంగా భస్మాభిషేకం నిర్వహించారు.అర్చకుడు కనమర్లపూడి రామకృష్ణ శుక్రవారం ఏకాదశి సందర్భంగా శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరునికి భస్మాభిషేకం,హారతి పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## కొత్తూరు సుబ్బరాయునిలో టెంకాయల అంగడి వేలము 18.35 లక్షల రాబడి..!

-ఆలయ ఈవో యం.రామకృష్ణ.





**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 13. (నంది పత్రిక ):**ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం నిర్వహించిన టెంకాయల అంగడి గుత్త బహిరంగ వేలము వల్ల రూ.18,35,000/- లు రాబడి వచ్చినట్లు ఆలయ ఈవో యం.రామకృష్ణ తెలిపారు. వేలములో 6 మంది సభ్యులు ఒక్కొక్క లక్ష రూపాయలు డిపాజిట్లు చెల్లించగా, నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన ఏ.వీరారెడ్డి 18,35000/- హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గత సంవత్సరం 15,50,000/- పోగా గతం కన్న నేడు 2.85 లక్షలు ఆదాయం వచ్చిందని, అదేవిధంగా పూల అంగడి వేలంలో 5 లక్షల 10 వేలు రాగా, గత సంవత్సరం 4 లక్షల 77 వేలు పోగా 33 వేలు ఆదాయం వచ్చిందని, గాజులు, పటముల అంగడి వల్ల 70,500/- రాగా గత సంవత్సరం 69,500/- వచ్చిందని వీటివల్ల ఒక వెయ్యి రూపాయలు మాత్రం ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. మూడు వేలముల వల్ల గత సంవత్సరం కన్నా 3 లక్షల 19 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ వేలము నంద్యాల డివిజనల్ దేవాదాయశాఖ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, బీరం శివరామిరెడ్డి, బాణా శ్రీనివాస రెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, పోలీసులు సిబ్బంది మరియు వేలం పాటదారులు పాల్గొన్నారు.



## రేవంత్‌ను బలోపేతం చేస్తున్న ఫలితాలు !

తెలంగాణ పట్టణ పోరులో ఊహించినట్లుగానే కాంగ్రెస్ అధిక్యం చాటుకుంది. తాజాగా అందిన ఫలితాలను బట్టి ఆ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమైంది. వరుస ఎన్నికలతో తనకు తిరుగులేదని చాటుకుంది. మొన్నటి పంచాయితీ ఎన్నికలు, నేటి పట్టణ ఎన్నికలు, రెండు ఉప ఎన్నికల్లో గెలుపు ద్వారా సత్తా చాటింది. రేవంత్ నాయకత్వానికి ఇది బలమైన పునాదిగా నిలవనుంది. ఇకపోతే ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న బిఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో ఇంకా సానుకూలత వ్యక్తం కావడం లేదు. ప్రజల్లో వారు చేసిన అవినీతి తాలూకు మరకలు చెరిగి పోవడం లేదు. ప్రజలు ఇంకా వారిని నమ్మేస్థితికి రాలేదనే చెప్పాలి. బావాబామ్మర్దులు పోటాపోటీగా ప్రచారం చేసినా బిఆర్ఎస్ నావను గట్టెక్కించలేక పోయారు. వారు రెండో స్థానంతోనే సరిపెట్టుకోక తప్పడం లేదు. అలాగని కాంగ్రెస్‌కు పోటీ ఇచ్చే స్థాయిలో ఈ రెండో స్థానం లేదు. అందరూ అనుకున్నట్లుగానే కరీంనగర్, నిజామాబాద్ కార్పోరేషన్లలో బిజెపి ఆధిక్యం ప్రదర్శించింది. ఇది కేవలం కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ధర్మపురి అర్వింద్‌ల వ్యక్తిగత ప్రతిభ తప్ప మరోటి కాదు. బిజెపి ఊదరగొడుతున్నట్లుగా ప్రజల్లో ఆ పార్టీకి ఇంకా పెద్దగా అవకాశం రాలేదని తెలుసుకోవాలి. చిల్లర ఉపన్యాసాలు మాని తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఏమైనా చేయాలన్న సంకల్పం ఆ పార్టీలో రావాలి. కేంద్రాన్ని ఒప్పించి ఓ నాలుగు అభివృద్ధి పనులను చేపడితే తప్ప బిజెపికి మనుగడ ఉండదు. ఇకపోతే అనూహ్య ఘటన ఒకటి చోటు చేసుకుంది. కుటుంబ పార్టీతో తెగదెంపులు చేసుకుని కొత్త పార్టీవైపు అడుగులు వేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అనూహ్యంగా దూసుకు వచ్చారు. ఓ అడుగు పడేలా చేశారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుతో పోటీకి దిగుతున్నట్లు ప్రకటించి రంగంలోకి దూకారు. ఆమె ప్రయత్నం ఫలించింది. గద్వాల జిల్లా వడ్డేపల్లిలో ఏకంగా పాగా వేశారు. ఇది ఆమె రాజకీయ పార్టీ ప్రయత్నాలకు పెద్ద విజయంగానే చూడాలి. ఇక రాజకీయాల విషయానికి వస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని నిరూపితం అవుతోంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మనుగడ సాగించడమే కాదు పటిష్టం అవుతోంది. పంచాయితీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ ఇప్పుడు నగర, పట్టణ ఓటర్లలోనూ తన పట్టు నిలుపుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ విజయ పరంపర లోక్‌సభ ఎన్నికలు, రెండు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికల్లో విజయాల వరకు సాగింది. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లోనూ అదేజోరు కొనసాగించింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు బుధవారం జరిగిన పోలింగ్ తరవాత శుక్రవారం చేపట్టిన కౌంటింగ్‌లో కాంగ్రెస్ ఆధిక్యం కొనసాగింపు స్పష్టంగా కనిపించింది. కరీంనగర్, నల్లగొండ, నిజాబాద్, పాలమూరు, ఉమ్మడి వరంగల్, మెదక్ జల్లాల్లోనూ దాదాపు ఎక్కువ పట్టణాల్లో విజయం కైవసం చేసుకుంది. కాంగ్రెస్ తరపున అన్నీ తానై ఎన్నికల పక్రియకు నేతృత్వం వహించిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో మరింత బలపడే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీయే ఆధిక్యతను కొనసాగించడం ద్వారా రేపటి మండల, జడ్పీల్లోనూ పట్టును కొనసాగిస్తుందన్న భరోసా ఏర్పడింది. నగరాలు, పట్టణాల్లోని ఓటరు ఆలోచన భిన్నంగా ఉంటుందనే విషయం గుర్తించిన సిఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అభివృద్ధిని తెరపైకి తెచ్చారు. మోడీకి గల్లీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాపాలను ఎండగట్టారు. ఇవన్నీ కూడా ఇంకా ప్రజల మదిలో చెదిరిపోలేదని తెలుసుకునే ఆయన ఈ తరహా ప్రచారంలో దూసుకు పోవడం కలిసివచ్చింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం అన్నది ప్రజలు కూడా గుర్తించారు. ఎందుకంటే అధికార పార్టీ అండవుంటే తప్ప అభివృద్ధి సాధ్యం కాదు. అందుకే ప్రజలు కూడా అధికార కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని అనుకోవాలి. నగర, పట్టణ ప్రాంతాల్లో పౌర సమస్యల్ని ప్రధానంగా చర్చకు తెచ్చి వారిని లోచించేలా కాంగ్రెస్ నేతలు పనిచేశారు. ప్రధాన ప్రతిపక్షంగా బిఆర్ఎస్ పదేళ్ల పాటు తెలంగాణను ఏలింది. ఈ పదేళ్లలో అప్పుల చేసిందే తప్ప అభివృద్ధి చేయలేదు. ఆస్తులు పెంచుకుందే తప్ప ప్రజలను ఆదుకోలేదు. లక్షల కోట్లు ఆస్తులు కూడబెట్టారని గ్రామస్థాయి వరకు ప్రజల్లో ఇంకా చర్చ సాగుతోంది. కాలికి చెప్పుల్లేని బిఆర్ఎస్ నేతలు బెంజ్ కారుల్లో తిరుగుతుంటే ప్రజలకు మండడం ఖాయం. అందుకే అసెంబ్లీ ఎన్నికలు మొదలు అన్ని ఎన్నికల్లోనూ వాతలు పెడుతూ వచ్చారు. పెద్దాయన ఇల్లు కదలలేని స్థితలో ఉన్నారు. అది కూడా పార్టీకి మైనస్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో బిజీ ఉన్నానంటూ టెలిఫోన్ టాపింగ్' విచారణకు వ్యవధి కోరిన పార్టీ అధినేత కేసీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంపై దృష్టిపెట్టలేక పోయారు. అయితే అందుకు భిన్నంగా రేవంత్ రెడ్డి నిరంతరం ఎన్నికల్లో గెలుపుపైనే దృష్టి సారించారు. అమెరికాలో ఉన్నా, దిశా నిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి అన్నీ తానై ఎన్నికల బరువు బాధ్యత తీసుకున్నారు. స్వయంగా పలు జిల్లాలు పర్యటిస్తూ ఎన్నికల ప్రత్యక్ష-పరోక్ష ప్రచారంలో పాల్గొన్నారు. వనరుల్ని సమకూర్చారు. గెలుపు మంత్రం జపిస్తూ మంత్రుల్ని పురమా యించారు. మంత్రులకు లోక్‌సభ నియోజకవర్గాల వారిగా బాధ్యతలు అప్పగించి బాధ్యతలు అప్పగించారు. మంత్రులు తమకు అప్పగించిన బాధ్యతల్లో తలమునకలై ఉండేలా నిరంతరం పర్యవేక్షించారు. అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను ఏక కాలంలో విమర్శలు చేస్తూ ప్రజల్లో చర్చ సాగేలా చేయడంలో రేవంత్ విజయం సాధించారు. అదే ఇప్పుడు పుర ఎన్నికల్లో విజయానికి బాటలు వేసింది. అయితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అక్కడక్కడా కొన్నచోట్ల విజయం సాధించినా, గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. అందుకేనేమో ఆ పార్టీ ఎన్నికల తెల్లారే కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని పిల్లి శాపనార్థాలు చేసింది. ఇక తమదే అధికారం అంటూ హుంకరిస్తున్న బీజేపీ ఆశించిన స్థాయి ప్రజా మద్దతును కూడగట్టలేకపోయింది. మొత్తంగా కాంగ్రెస్ తనకు తిరుగులేదని నిరూపించింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com